www.akshratimes.com

తెలుగు దినపత్రిక

ఆక్షర టైమ్స్

మా అక్షరం ప్రజల పక్షం

RNI.NO : APTEL/2022/90211



బ్లాక్‌మెయిల్ కోసమే హైడ్రా : రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఫైర్

సంపుటి : 04 సంచిక : 102 పేజిలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com బుధవారం 29 - 07 - 2026

Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool



మంత్రి నారా లోకేశ్‌కు పేర్ని నాని బహిరంగ సవాల్

- డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న పేర్ని నాని
- డీఎస్సీ అవకతవకలపై చర్చకు రావాలని లోకేశ్ కు సవాల్
- చంద్రబాబు వస్తే చర్చకు జగన్ వస్తారని వ్యాఖ్య

అమరావతి :

డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయంటూ మంత్రి నారా లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం


- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ప్రెసిషన్ ఆంకాలజీ క్యాన్సర్ సెంటర్
- ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఒప్పందం
- ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా, ఇతర దిగ్గజ సంస్థల ఒప్పందం
- అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు
- ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అధునాతన జన్యు పరీక్షలు
- దేశంలోనే తొలిసారిగా ప్రెసిషన్ ఆంకాలజీ విధానం ప్రారంభం
- అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



అమరావతి :

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అంతర్జాతీయ ఫార్మా, బయోటెక్ దిగ్గజ సంస్థలైన ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ విధానాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఆస్ట్రాజెనెకా ఇండియా, అమరావతిలో 'ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్'ను ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం ద్వారా ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ సేవలను అందిస్తారు. దీనివల్ల కేన్సర్ చికిత్సలో కచ్చితమైన, వేగవంతమైన ఫలితాలు సాధించేందుకు వీలు కలుగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర - మిగతా 2 లో

జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ



- శ్రీశైలం డ్యామ్ కు పెరుగుతున్న వరద ప్రవాహం
- కృష్ణానది ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలు
- జూరాల ప్రాజెక్టుకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- క్రస్ట్ గేట్లు ఎత్తేసిన అధికారులు.. శ్రీశైలం జలాశయానికి వరద

అమరావతి :

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో విస్తారంగా వానలు పడుతుండటంతో - మిగతా 2 లో



జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

- సునామీ హెచ్చరిక జారీ
- జపాన్‌లోని కుమమోటోలో 7.1 తీవ్రతతో భారీ భూకంపం
- క్యూషు ద్వీపంలోని కుమమోటో సమీపంలో భూకంప కేంద్రం
- తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరిక

ఢిల్లీ :

జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం మధ్యాహ్నం భారీ భూకంపం వణికించింది. క్యూషు ద్వీపంలోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. దీంతో జపాన్ వాతావరణ సంస్థ వెంటనే తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది.స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. కుమమోటో నగర సమీప ప్రాంతం కేంద్రంగా, భూమికి 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు నమోదయ్యాయి. అరియాకే, - మిగతా 2 లో

నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు




- విద్యార్థుల ఆందోళనలపై సుప్రీం కీలక ఆదేశాలు
- విద్యార్థుల ఆందోళనలపై సిట్ కు దిశానిర్దేశం
- అదుపులో ఉన్న మైనర్లను విడుదల చేయాలని ఆదేశం
- ఎలక్ట్రానిక్ ఆధారాలు భద్రపరచాలని సూచన
- కేంద్రం, ఏడు రాష్ట్రాలకు నోటీసులు

ఢిల్లీ :

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగం, పోలీసులపై జరిగిన దాడులపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అలాగే నేర చరిత్ర లేని విద్యార్థి నిరసనకారులపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు - మిగతా 2 లో

అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్

- కనీసం 20 మంది మృతి, పలువురికి గాయాలు
- పీఓకేలో లాంగ్ మార్చ్ సందర్భంగా హింస
- చర్చలు విఫలమవడంతో జేఏఏసీ ఆందోళన
- నిరసనకారులపై కాల్పుల ఆరోపణలు



ఢిల్లీ :

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)' చేపట్టిన లాంగ్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసలో కనీసం 20 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం.జేఏఏసీ - మిగతా 2 లో

ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది

ప్రభుత్వ విచక్షణాధికారం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు
- ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం



హైదరాబాద్ :

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన - మిగతా 2 లో

మేం ఎవరికి ఏం అమ్మాలో

ఎవరూ చెప్పనక్కర్లేదు

- టర్కీకి ఎఫ్-35 విమానాల విక్రయంపై నెతన్యాహుకు ట్రంప్ షాక్
- టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై నెతన్యాహు అభ్యంతరం
- టర్కీ తమకు నమ్మకమైన భాగస్వామి అన్న ట్రంప్



ఢిల్లీ :

టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ - మిగతా 2 లో



శివరాజ్ సింగ్ చౌహాన్ తో

రేవంత్ రెడ్డి భేటీ

- 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విన్నపం
- గత ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని కేంద్ర మంత్రికి తెలిపిన రేవంత్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చాలని విన్నపం
- గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలన్న సీఎం

హైదరాబాద్ :

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా - మిగతా 2 లో

ప్రతి సంవత్సరం ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- దిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- మీడియాతో మాట్లాడిన సీఎం
- యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపణ
- కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తామని వెల్లడి



హైదరాబాద్ :

దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,, ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల సమస్యలు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. విద్య, వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు.కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందని, గ్లోబరీనా వంటి సంస్థలు నాడు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయని, నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారని, - మిగతా 2 లో

తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు
- చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి
- సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య



హైదరాబాద్ :

తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శుభపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు.సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేక పోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల - మిగతా 2 లో

సంపాదకీయం

వాఘా.. గుండెలు ఉప్పొంగలేదు!



చిన్నప్పటి నుంచి మన దేశ సరిహద్దుల గురించి వినీ చదివీ ఒక చరిత్ర విద్యార్థిగా ఉప్పొంగిపోయాను. ఉత్తరాన హిమాలయాలు మంచుతో నిండివుంటాయనీ-- కైబర్, బోలాన్ కనుమల గుండా ఇతర ప్రాంతాల నుంచి మన దేశంలోకి శతాబ్దాలుగా మానవ సంచారం జరిగిందని చదువుకుని, మాకు మేమే ఉత్తేజితులమయ్యాం. బౌద్ధ భిక్షువులే కాక హర్షుడి కాలం నుంచి హుయన్‌త్సాంగ్, అలెగ్జాండర్, రాహుల్ సాంకృత్యాయన్ వంటి ఎందరో మహనీయులు మానవ నాగరికతకు, సంస్కృతికి, చరిత్రకు వారధి కట్టారు. అదంతా మనసులో నిండివుండడంతో డెబ్భై మూడేళ్ల వయసులో పదిమందితో కలిసి హిమాలయాల సందర్శనానికి సాహసంతోనే బయలుదేరాం. వారిలో సగంమంది అరవైలు దాటినవాళ్లు. మిగిలినవాళ్లు యాభైలలో ఉన్న యువకులు.ఇదంతా దేనికంటే-- ఈ వయసులో శ్రీనగర్ నుంచి లేహ్ మీదుగా నుబ్రావాలి, కృతుంగాపాస్, పాన్‌గాంగ్ సరస్సుదాకా ఆక్సిజన్ లెవల్స్‌తో ఇబ్బంది పడతామని తెలిసి కూడా సాహసించాం. పాన్‌గాంగ్ (చైనా సరిహద్దు) నుంచి కార్గిల్ (పాకిస్థాన్ సరిహద్దు) దాకా ప్రయాణించి అద్భుతమైన పర్వతాలను, మరోవైపు దిగంతాలను తలపించే లోయలను చూస్తూ-- ప్రమాదభరితమని తెలిసినా సంతోషంగా గడిపాం.ఇంత ఆనందంలో చివరి రోజు, చివరి ఘట్టం ఎంత దిగులుగా, నిరాశగా, నిస్పృహగా మిగిలిందంటే-- మా పదిహేను రోజుల యాత్రను నీరసపరిచింది. భారతీయులుగా 'వాఘా' సరిహద్దు సైనిక కవాతు చూడడం నిజంగా గర్వకారణం. మేమంతా ఎప్పటినుంచో ఆ బోర్డర్‌లో ప్రదర్శించే సైనిక కవాతు గురించి వినివున్నాం. నెట్‌లో చూసి కూడా ఎంతో ఉత్తేజితులం అయివున్నాం. అయితే మేము వెళ్లినరోజు అక్కడి ప్రదర్శన మాకు అత్యంత నిరాశను కలిగించింది. ఈ నెల తొమ్మిదో తేదీ అయిదు గంటలకల్లా ఆగమేఘాల మీద అక్కడికి చేరుకున్నాం. ఆ వేల మందిలో కూర్చునే చోటు దక్కించుకుని ప్రదర్శన కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాం. అయిదున్నరకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు, ఆరున్నరకు గానీ ప్రారంభం కాలేదు. అది కూడా ఎంత నిరాశ కలిగించిందో చెప్పలేం. అయిదున్నరకు సందర్శకుల నుంచి-- మహిళలను ప్రదర్శన జరిగే చోటుకు పిలిచారు. వారితో జాతీయ జెండా ప్రదర్శింపజేశారు. అంతవరకే అయితే ఫరవాలేదు. కానీ దేశభక్తితో కూడిన పాటలు పెట్టి మహిళలతో చేతులు ఊపుతూ ప్రదర్శన చేయించారు. అదీ పోనీ అనుకుంటే-- ఈ చేరిన మహిళలు ఆ కవాతు జరిగే ప్రదేశంలో బతుకమ్మలాడారు. కొందరైతే చేతులు పట్టుకుని 'ఒప్పుల కుప్ప' ఆడారు. అది చూస్తూ మాకు ఎంత ఆవేదన కలిగిందో చెప్పలేం.మహిళలను ప్రతి దానిలో భాగం చేయాలనే కాంక్ష కొద్దీ ఈ మధ్య రథయాత్రలు, దేవుడి ఊరేగింపుల ముందు, కోలాటాలూ వేయించడం-- ఇది ఏ సంస్కృతో తెలియదుగానీ దిగువ మధ్యతరగతి స్త్రీలు ఈ ప్రదర్శనలకు ఆలంబన కావడం దురదృష్టం. గుడిలో పూజాకైంకర్యాలు చేసే దేవదాసీలను నిషేధించి-- వీధి ఊరేగింపుల్లో భక్తి పేరుతో ఎందుకు వీరిని తెస్తున్నారో అర్థం కావడం లేదు. దానినే సహించలేని సమాజికులుగా 'వాఘా' బోర్డర్ సైనిక కవాతు సందర్భంగా కూడా మహిళలను ఆ ట్రాక్‌లోకి ఆహ్వానించి ప్రదర్శనను ఇంత పేలవంగా, అగౌరవంగా జరపడం శోచనీయంగా భావిస్తున్నాం. చివరికి నెట్‌లో చూసినపాటి ప్రదర్శన కూడా లేకుండా సైనిక కవాతు ముగించారు. బోర్డర్ గేట్లు తీయడం లేదు. ఇరువైపుల సైనికుల కరచాలనం లేదు. ఇదంతా అనకూడదుగానీ ఏదో విన్యాసం కింద తయారయింది.భారతీయ పౌరులందరికీ దేశభక్తి ఎంతో మహోన్నతమైనది. ఆ మాట తలుచుకుంటే గుండెలు ఉప్పొంగుతాయి. దానికి ప్రతీక అయిన 'వాఘా బోర్డర్' కవాతును ఆ రోజు అలా చూడటం నాకు ఎంతో బాధాకరంగా అనిపించింది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం

మొదటిపేజీ తరువాయి - ప్రజలందరికీ అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు తీసుకురావడమే ఈ ఒప్పందం లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో క్వాంటం స్థాయి పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ ఒప్పందంతో ఏపీ ఆరోగ్య, పరిశోధన రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ

మొదటిపేజీ తరువాయి - జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది.ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది.మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భీమా నది ప్రవాహాలు కూడా తోడైతే జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపించడంతో, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి మరింత జలకళ రానుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి భేటీ

మొదటిపేజీ తరువాయి - సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు.గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 'ప్రధాని ఆవాస్ యోజన – గ్రామీణ్' 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వ విచక్షణాధికారం

మొదటిపేజీ తరువాయి - ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు."బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా ఒక బీఆర్ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు

మొదటిపేజీ తరువాయి - ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషనర్ల ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశంపై కేంద్రంతో పాటు అసోం, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.ఆందోళనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న మైనర్లను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం నిరసనల్లో పాల్గొన్నారనే కారణంతో అరెస్టు చేసిన లేదా అదుపులో ఉంచిన విద్యార్థులకు నేర చరిత్ర లేకపోతే వారిని కూడా విడుదల చేయాలని స్పష్టం చేసింది. అయితే క్రిమినల్ నేపథ్యం ఉన్న



వారికి ఈ రక్షణ వర్తించదని పేర్కొంది.ఆందోళనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, డ్రోన్ వీడియోలు, బాడీ కెమెరా రికార్డింగులు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ వివరాలు, పీసీఆర్ లాగ్‌లు సహా అన్ని ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను కూడా భద్రపరచాలని, అయితే ప్రస్తుతానికి వాటిని బహిర్గతం చేయవద్దని స్పష్టం చేసింది.పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులపైనా సమగ్ర దర్యాప్తు అవసరమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. సుమారు 250 మంది పోలీసులకు కూడా గాయాలయ్యాయని తెలిపారు. నిరసనల్లో సంఘవిద్రోహ శక్తులు చొరబడి ఉండే అవకాశం ఉందని, నిజానిజాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వచ్చే వారానికి వాయిదా వేసింది.

మంత్రి నారా లోకేశ్ కు పేర్ని నాని బహిరంగ సవాల్

మొదటిపేజీ తరువాయి - విరుచుకుపడ్డారు. డీఎస్సీ అవకతవకలపై బహిరంగ చర్చకు రావలసిందిగా ఆయన లోకేశ్ కు సవాల్ విసిరారు. ఒకవేళ చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే వైసీపీ నుంచి జగన్ వస్తారని... లోకేశ్ వస్తే స్వయంగా తానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం దీనిని 'మెగా డీఎస్సీ' అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, లోపల జరిగిన అక్రమాల వల్ల ఇది 'దగా డీఎస్సీ'గా మారిందని మండిపడ్డారు. మంత్రిగా లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలను పక్కనబెట్టి మిగిలిన అన్ని శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కొంచెమైనా నైతికత ఉంటే ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, డీఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తమ సొంత ప్రచార సాధనాలు, పత్రికల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ చేశారు.

జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

మొదటిపేజీ తరువాయి - యత్సుషిరో సముద్ర తీరాల్లో సుమారు ఒక మీటర్ ఎత్తున అలలు ఎగిసిపడే ముప్పు ఉందని, ప్రజలందరూ తీరానికి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. భూకంపం కారణంగా కుమమోటో ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా బుల్లెట్ రైళ్లతో సహా అన్ని రైలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు. క్యుషు ద్వీపంలోని కుమమోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఒయిటా, మియాజాకి ప్రాంతాల్లో జపాన్ ప్రభుత్వం తదుపరి అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది.జపాన్‌లో ప్రతి ఏటా వందలాది భూకంపాలు సంభవిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించే భూకంపాలలో దాదాపు 18 శాతం జపాన్‌లోనే నమోదవుతుంటాయి. వీటిలో అత్యధిక శాతం స్వల్ప తీవ్రత కలిగినవే అయినప్పటికీ, కొన్నిసార్లు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 2011లో రిక్టర్ స్కేలుపై 9.0 తీవ్రతతో సంభవించిన వినాశకర భూకంప వల్ల సుమారు 18,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న జపాన్ ఉత్తర ప్రాంతంలో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే.

అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్

మొదటిపేజీ తరువాయి - మంగళవారం ఎక్స్‌లో చేసిన పోస్టు ప్రకారం.. లాంగ్ మార్చ్ బృందాలు రావల్‌కోట్‌కు చేరుకున్నాయి. ఇప్పటివరకు 19 మంది మృతుల గుర్తింపును నిర్ధారించామని తెలిపింది. తలకు బుల్లెట్ గాయం అయిన మరో వ్యక్తి వద్ద గుర్తింపు పత్రాలు లేకపోవడంతో మొత్తం మృతుల సంఖ్య 20కి చేరిందని పేర్కొంది. పరిస్థితులు సాధారణమైన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపింది.జేఏఏసీ, పాకిస్థాన్ అధికారుల మధ్య చర్చలు విఫలం కావడంతో ఈ లాంగ్ మార్చ్ చేపట్టారు. ఆదివారం మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ సోమవారం ముజఫరాబాద్ వైపు సాగింది. మరోవైపు పాక్ భద్రతా బలగాలు శాంతియుత నిరసనకారులపై సోమవారం సాయంత్రం కాల్పులు, టియర్ గ్యాస్, భారీ బలప్రయోగానికి పాల్పడ్డాయని 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఆరోపించింది. దీంతో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది.ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు వెంటనే జోక్యం చేసుకోవాలని యూకేపీఎన్‌పీ కోరింది. శాంతియుత నిరసనకారులపై కాల్పులు, అధిక బలప్రయోగాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు పీఓకేలో జరుగుతున్న నిరసనలపై భారత విదేశాంగ శాఖ గత నెల స్పందించింది. అక్కడ పోలీసుల దౌర్జన్యాల్లో పలువురు మరణించారని, అనేక మంది గాయపడ్డారని పేర్కొంటూ పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా నిలపాలని ఆశిస్తున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

మేం ఎవరికి ఏం అమ్మాలో ఎవరూ చెప్పనక్కర్లేదు

మొదటిపేజీ తరువాయి - నెతన్యాహు వ్యక్తం చేసిన అభ్యంతరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తోసిపుచ్చారు. తాము ఎవరికి ఏ ఆయుధాలు అమ్మాలో ఎవరూ తమకు చెప్పాల్సిన అవసరం లేదని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇజ్రాయెల్ ప్రధానితో భేటీకి ముందు రోజు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. టర్కీ ప్రెసిడెంట్ రెజెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌ను తన మంచి మిత్రుడిగా అభివర్ణించిన ట్రంప్... టర్కీ తమకు అత్యంత విలువైన, నమ్మకమైన భాగస్వామి అని కొనియాడారు.అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, టర్కీ తీవ్రవాద భావజాలంతో కూడిన పాలనలో ఉందని, అలాంటి దేశానికి ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయిస్తే పశ్చిమాసియాలో సైనిక సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ విమర్శలకు ట్రంప్ ఘాటుగా స్పందిస్తూ, ఇజ్రాయెల్‌కు టర్కీపై మంచి అభిప్రాయం లేకపోవచ్చు కానీ తన విషయంలో మాత్రం టర్కీ ఎంతో నమ్మకంగా వ్యవహరించిందని స్పష్టం చేశారు.

"ప్రతి సంవత్సరం ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం

మొదటిపేజీ తరువాయి - గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో చట్టాలు రూపొందిస్తామని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బకాయి పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు భారంగా మారిందని అన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ తాము ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారని తెలిపారు.ఏపీలో రూ.10 వేల కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆర్.కృష్ణయ్య ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ రాష్ట్రంలో బకాయిలపై మాట్లాడరని సీఎం తెలిపారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, అక్కడ బకాయిలపై మాట్లాడాలని, ఏపీలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాక తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఏ ఏడాదికి సంబంధించిన బకాయిలు అదే ఏడాది చెల్లిస్తామని, ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రణాళికలు రచించామని, భవిష్యత్తులో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య తెలంగాణలో ఉండదని స్పష్టం చేశారు.విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం. యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోంది. విద్య వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం.రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి.

తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే



మొదటిపేజీ తరువాయి - ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

ఏపీపై ఎల్‌నినో పంజా.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

ఏపీపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. జూలైలో 69 శాతం లోటు వర్షపాతం

రానున్న నెలల్లో 40 శాతం వరకు వర్షాభావ పరిస్థితులు

పత్తి, వరి పంటలపై ప్రభావం.. 122 మండలాలను గుర్తించిన ప్రభుత్వం

పంటల రక్షణకు అత్యవసర ప్రణాళిక..

ప్రత్యామ్నాయాలపై దృష్టి



పశుగ్రాసానికి కొరత లేదు.. 5 నెలలకు సరిపడా నిల్వలు సిద్ధం

ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు జూమ్ ద్వారా హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు పరిస్థితి తీవ్రతను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో జూలై నెలలో ఏకంగా 69 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో సగటున 35 నుంచి 40 శాతం వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. జూన్ నుంచి నవంబర్ మధ్య కాలంలో సాధారణంగా 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈసారి కేవలం 551 మి.మీ మాత్రమే కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు స్పష్టం చేశారు.ఈ ప్రభావం అన్ని జిల్లాల్లో ఉన్నప్పటికీ ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని అంచనా వేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పడంతో, వంశధార జలాలను తరలించి పంటలను కాపాడేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు సూచించారు.ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించిందని అధికారులు తెలిపారు. ఈ మండలాల్లో బోరు బావుల ఆధారంగా పంటలను కాపాడుకునే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఆగస్ట్ 3 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు.ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద నమోదుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని, వరి పంటకు మాత్రం ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు గుర్తుచేశారు. మరోవైపు, పశుగ్రాసానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐదు నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసాన్ని అందుబాటులో ఉంచామని పశుసంవర్ధక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

హైదరాబాద్‌లో భారీవర్షంతో చెరువుల్లా మారిన రహదారులు

కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్

హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా భారీ వర్షం

కురిసిన భారీవర్షంతో రహదారులన్నీ జలమయం

పలుచోట్ల పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు

ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు



హైదరాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్‌లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది.ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్‌లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాన నీటితో రోడ్లు మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, కేపీహెచ్‌బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కిలోమీటర్ దూరానికి గంట

చర్లపల్లి జైలు అభివృద్ధిపై డీజీ సౌమ్య మిశ్రా సమీక్ష

చర్లపల్లి,జులై 28 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు) తెలంగాణ జైళ్లను కేవలం శిక్ష అనుభవించే ప్రదేశాలుగానే కాకుండా, ఖైదీల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకువచ్చే పునరావాస కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా, కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిచందన దాసరి సంయుక్తంగా మంగళవారం చర్లపల్లి కేంద్ర కారాగారాన్ని సందర్శించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు.పర్యటనలో భాగంగా ముందుగా చర్లపల్లి చెరువు పునరుద్ధరణ పనులను పరిశీలించారు. తెలంగాణ జైళ్ల శాఖ, హైదరాబాదు విపత్తు స్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో, భారతీయ చమురు సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల సహకారంతో చేపడుతున్న ఈ పనుల పురోగతిని అధికారులు వివరించారు. పనులు వేగంగా సాగుతున్నాయని అభినందించిన డా. సౌమ్య మిశ్రా, చెరువు చుట్టూ ఏర్పాటు చేస్తున్న నడక మార్గంలో చీకటి ప్రాంతాలను గుర్తించి అక్కడ సౌర విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సందర్శకుల భద్రత, సౌకర్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.అనంతరం ఖైదీల వ్యవసాయ కాలనిని సందర్శించిన ఆమె అక్కడ అభివృద్ధి చేస్తున్న స్వామి వివేకానంద వనం పనులను పరిశీలించారు. పచ్చదనాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణతో పాటు ఖైదీల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు.



అదే ప్రాంగణంలో నిర్మించనున్న బహుళ ప్రయోజనాల సమావేశ మందిరం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. తదనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారంలోని వివిధ పరిశ్రమలు, ఉత్పత్తి విభాగాలను సందర్శించి అక్కడ పనిచేస్తున్న ఖైదీలతో మాట్లాడారు. వారు తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించి వారి నైపుణ్యం, కృషిని అభినందించారు. ఖైదీలు వృత్తి నైపుణ్యాలను మరింత పెంపొందించుకోవాలని సూచిస్తూ, విడుదల అనంతరం గౌరవప్రదమైన జీవితం గడపడానికి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు అత్యంత కీలకమని తెలిపారు.కేంద్ర కారాగారం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ పనులను కూడా డా. సౌమ్య మిశ్రా పరిశీలించారు. ఈ శిక్షణా సంస్థ ద్వారా ఖైదీలకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక, వృత్తి విద్య అందించడంతో పాటు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా విడుదల అనంతరం ఉపాధి అవకాశాలు మరింత విస్తరిస్తాయని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణ జైళ్ల శాఖ ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన, హరిత ప్రాంగణాల అభివృద్ధి, చెరువుల పునరుద్ధరణ, జైలు పరిశ్రమల ప్రోత్సాహం, ఖైదీల నైపుణ్యాభివృద్ధి వంటి కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేస్తోందని తెలిపారు. జైళ్లను శిక్షా కేంద్రాల నుంచి సంస్కరణ, పునరావాసం, ఉపాధి కల్పనకు మార్గం చూపే కేంద్రాలుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిచందన దాసరి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ ఏర్పాటుకు జరుగుతున్న ఏర్పాట్లను సంబంధిత అధికారులతో సమీక్షించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో ఖైదీలను తీర్చిదిద్దేలా శిక్షణా కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. ఈ పర్యటనలో రాష్ట్ర కర్మాగారాల డైరెక్టర్ మోహన్ బాబు, పరిశ్రమల శాఖ ఉప సంచాలకులు ఖాలిద్ అఖ్తర్, కర్మాగారాల ఉప ప్రధాన తనిఖీ అధికారి మోహన్ రెడ్డి, కర్మాగారాల తనిఖీ అధికారి శ్రీధర్, జైళ్ల శాఖ ఇన్స్పెక్టర్ జనరల్ ఎన్. మురళిబాబు, డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ డా. డి. శ్రీనివాస్, చర్లపల్లి కేంద్ర కారాగార సూపరింటెండెంట్ జి. ప్రమోద్, ఖైదీల వ్యవసాయ కాలనీ సూపరింటెండెంట్ డి. భరత్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ మైసమ్మ ఆలయంలో వైభవంగా ఆషాఢ మాసం బోనం సమర్పణ

హాజరైన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల ప్రముఖులు

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

హైదర్‌నగర్,జులై 28 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి ఎం.ఈరన్న) ఆషాఢ మాస ఉత్సవాల సందర్భంగా హైదర్‌నగర్‌లోని మైసమ్మ అమ్మవారి దేవాలయంలో ఆషాఢ బోనాల సమర్పణ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానమేట్ గ్రామానికి చెందిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గణేష్ యాదవ్ మంగళవారం అమ్మవారికి సంప్రదాయబద్ధంగా బోనం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక



పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతర నాయకులు మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, విశిష్టతకు ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రతి కుటుంబంపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలని ఈ సందర్భంగా ప్రార్థించినట్లు తెలిపారు.

వివిధ పార్టీల ప్రముఖుల హాజరు:

ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్ గౌడ్, గంగల నరసింహ యాదవ్, కాంగ్రెస్ నాయకులు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్, నల్ల సంజీవరెడ్డి, ముద్దంగుల తిరుపతి, గంగల జంగయ్య యాదవ్, గంగల మల్లేష్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు గంగల రాధాకృష్ణ యాదవ్, ఉప్పల ఏకాంత్ గౌడ్, నారగోని కృష్ణ గౌడ్, నగేష్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు నిమ్మల రామకృష్ణ గౌడ్, సంగారెడ్డి, కే కృష్ణ నాయక్, బీజేపీ నేత బోయిని మహేష్ యాదవ్లతో పాటు బ్రహ్మయాదవ్, కోటేష్, రజనీకాంత్ రెడ్డి, శీను నాయక్, ఎన్. లక్ష్మణ్ ముదిరాజ్, రామస్వామి యాదవ్, వారి బంధుమిత్రులు, స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

రెండు ఆటోలు స్వాధీనం.. 300 కిలోల వరకు పన్నీర్ పట్టివేత

కల్తీ పన్నీర్‌పై ఎస్ఓటీ ఉక్కుపాదం..

కీసర,జులై 28 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి గొపగాని పాండు) మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధిలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న కల్తీ పన్నీర్ ముఠాపై ఎస్ఓటీ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. చర్లపల్లి నుంచి నాగారం శ్రీకాకుళం బస్తీ వైపు తరలిస్తున్న రెండు ఆటోలను వెంబడించి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో అడ్డగించి పట్టుకున్నారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 200 నుంచి 300 కిలోల వరకు అనుమానాస్పద కల్తీ పన్నీర్ను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారంతో రంగంలోకి దిగిన ఎస్ఓటీ బృందం, కల్తీ పన్నీర్‌ను సరఫరా చేస్తున్న ఆటోలను వెంబడించి కీసర పరిధిలో పట్టుకుంది. అనంతరం ఆటోలతో పాటు స్వాధీనం చేసుకున్న పన్నీర్‌ను కీసర పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఈ పన్నీర్‌ను హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు సరఫరా చేసే అవకాశాలు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలు లేదా నాసిరకం పదార్థాలతో తయారు చేసిన కల్తీ పన్నీర్‌ను మార్కెట్లో విక్రయించే ప్రయత్నం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈ వ్యవహారం వెనుక ఉన్న ప్రధాన సూత్రధారులు





ఎవరు? కల్తీ పన్నీర్ ఎక్కడ తయారవుతోంది? ఎవరెవరికి సరఫరా చేస్తున్నారు? గతంలో కూడా ఇలాంటి అక్రమ రవాణా జరిగిందా? అనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న పన్నీర్ నమూనాలను ఆహార భద్రత శాఖ ప్రయోగశాలకు పంపించి నాణ్యత పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. పరీక్షల నివేదికల ఆధారంగా సంబంధిత నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఘటనతో కీసర, నాగారం, చర్లపల్లి ప్రాంతాల్లో కల్తీ ఆహార పదార్థాల అక్రమ రవాణాపై మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను కీసర పోలీసులు త్వరలో అధికారికంగా వెల్లడించనున్నారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

కుటుంబ సభ్యులను పరామర్శించిన అట్టేపల్లి రామప్రభు

త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన నేతలు



శేరిలింగంపల్లి,జులై 28 .అక్షర టైమ్స్ :(ప్రతినిధి) నర్సంపేట బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకస్మాత్తుగా గుండెపోటుకు గురై చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రిలో చేరిన విషయం తెలుసుకున్న అట్టేపల్లి రామప్రభు మంగళవారం ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను నేరుగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యులెవరూ ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో తమ పూర్తి మద్దతు వారి కుటుంబానికి ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి రామప్రభుతో పాటు నిమ్మగడ్డ వెంకన్న, బోయిని మహేష్ యాదవ్, ఫ్లోరెన్స్, ఎడ్ల కల్పన, అడప అజయ్, అట్టేపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


బీరప్ప గడ్డ కమ్యూనిటీ హాల్ కు మహర్దశ


మాజీ కార్పొరేటర్ బన్నాల గీత

15 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బీరప్ప గడ్డ మొదటి అంతస్తు కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పర్యవేక్షణ

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

ఉప్పల్‌జులై 28 .అక్షర టైమ్స్ :(హరి మోహన్ రెడ్డి) బీరప్ప గడ్డ డివిజన్లోని బీరప్ప గడ్డ లైబ్రరీ వెనకాల ఉన్న కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులను సుమారు 15 లక్షల రూపాయలతో నిర్మిస్తున్నామని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. అనంతరం ప్రవీణ్ ముదిరాజ్ కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ మరియు జిహెచ్ఎంసి అధికారులతో పర్యవేక్షిస్తూ ... కమ్యూనిటీ హాల్లో లో వెంటిలేషన్ ఎక్కువ ఉండే విధంగా ఎక్కువ కిటికీలు పెట్టాలని ,అదేవిధంగా డోర్ సైజు కూడా పెద్దదిగా ఉండే విధంగా పెట్టమని, ఎలక్షన్ల సమయంలో ఎలక్షన్ బూత్ గా ఉన్న ఈ కమ్యూనిటీ హాల్లో ప్రజలు తరచుగా ఎక్కువ శాతం మంది వచ్చి పోతూ ఉంటారని తెలుపుతూ ,తలుపు నిర్మాణం పెద్దగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని జిహెచ్ఎంసి అధికారులను కోరడం జరిగింది, అదే కాకుండా కాంట్రాక్టర్ కూడా నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిర్దీత సమయంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తి చేసి బీరప్ప గడ్డ ప్రజలకు అందించాలని అన్నారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పండ్ల కిషన్ గౌడ్, వంజరి నర్సింగ్ రావు ,తిరుపతి యాదవ్, కోల వరుణ్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు






జమ్మిగడ్డ పీహెచ్‌సీ దుస్థితిపై స్పందన.. సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

అక్షర టైమ్స్ కథనం తర్వాత యాక్షన్.. పీహెచ్‌సీలో మార్పులకు ఆదేశాలు


కాప్రా,జులై 28 .అక్షర టైమ్స్ :(జిల్లా ప్రతినిధి గోపగాని పాండు) జమ్మిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో నెలకొన్న దయనీయ పరిస్థితులపై అక్షర టైమ్స్ ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్‌వో) స్పందించింది. ఏఎస్‌రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్, జిల్లా కార్యదర్శి అల్లూరయ్య ప్రజల సమస్యలను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లడంతో మంగళవారం సంబంధిత అధికారులతో కలిసి జమ్మిగడ్డ పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.తనిఖీలో ఆరోగ్య కేంద్రంలోని మౌలిక వసతులు, టాయిలెట్ల దుస్థితి, పరిశుభ్రత, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ, వైద్య శాఖ అధికారులతో సమావేశమై సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో గుర్తించిన లోపాలను అత్యవసరంగా సరిచేయాలని డీఎంహెచ్‌వో అధికారులను ఆదేశించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, టాయిలెట్లు, ఇతర మౌలిక వసతులను త్వరితగతిన మెరుగుపరచి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. పీహెచ్‌సీలో ఉన్న సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు ప్రజల తరఫున నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అల్లూరయ్య, సీనియర్ నాయకులు మామిడి శ్రీనివాస్, భద్రగామ నరసింహ తదితరులు పాల్గొన్నారు.






బీరంగూడ డివిజన్‌లో మౌలిక

వసతుల కల్పనకు అధికారుల చొరవ తీసుకోవాలని వినతి





అమీన్‌పూర్‌జులై 28 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.వీరేష్) అమీన్‌పూర్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీరంగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వందనపురి కాలనీ, ఎస్ ఎన్ ఐ కాలనీ, మారుతి నగర్ ప్రాంతాలలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను అత్యవసరంగా చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. కాలనీల్లో రోడ్లు మరియు డ్రైనేజీ సదుపాయాలు సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్షాకాలంలో ఈ సమస్యలు మరింత జటిలమవుతున్నాయని తెలిపారు. ప్రజల ప్రాథమిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులను త్వరగా మంజూరు చేసి వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌ను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, స్థానిక ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని శశిధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాలనీల్లో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన సమస్యలను అధికారులు ప్రత్యేక ప్రాధాన్యతగా తీసుకొని శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి,
కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

ఆపదలో అండగా.. మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన నాయకులు

నాగారం,జులై 28 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి గోపగాని పాండు) బ్రెయిన్ స్ట్రోక్‌తో అస్వస్థతకు గురై సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగారం మాజీ సర్పంచ్, మాజీ మున్సిపల్ అధ్యక్షుడు కుత్తాడి నరసింహ ఆరోగ్య పరిస్థితిని మల్కాజ్గిరి పార్లమెంట్ కన్వీనర్ కందికంటి అశోక్ కుమార్ గౌడ్ మంగళవారం పరామర్శించారు. ఆసుపత్రికి చేరుకున్న ఆయన ముందుగా చికిత్స అందిస్తున్న వైద్యులను కలిసి నరసింహ ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షల ఫలితాలు, కొనసాగుతున్న చికిత్స విధానం గురించి సమగ్రంగా తెలుసుకున్నారు. ప్రస్తుతం నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని వైద్యులు వివరించినట్లు సమాచారం. అనంతరం ఆసుపత్రిలో ఉన్న కుత్తాడి నరసింహ కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించిన అశోక్ కుమార్ గౌడ్, ఆందోళన చెందవద్దని వారికి ధైర్యం చెప్పారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స అందుతోందని, నరసింహ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అన్ని విధాలా అండగా ఉంటామని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని భరోసా కల్పించారు.కుత్తాడి నరసింహ ప్రజా సేవలో విశేష గుర్తింపు పొందిన నాయకుడని, గ్రామాభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో నాగారం మాజీ మున్సిపల్ అధ్యక్షుడు కొండ జంగారెడ్డి పాల్గొని, కుత్తాడి నరసింహ కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ఆందోళన చెందవద్దని, నరసింహ త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ వారికి మనోధైర్యాన్ని కల్పించారు. కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఫీల్జాదిగూడ మాజీ మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. వారు కూడా వైద్యులను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

మియాపూర్ నూతన సీఐ జయరామ్‌ను కలిసిన ఉదయ్ కిరణ్



మియాపూర్,జులై 28 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న) మియాపూర్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. జయరామ్‌ను యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ యలమంచి ఉదయ్ కిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ జయరామ్‌ను శాలువాతో సత్కరించి, మొక్కను బహుకరించి నూతన బాధ్యతలు చేపట్టినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ... మియాపూర్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజా భద్రత మరింత పటిష్టం కావడంలో నూతన సీఐ నాయకత్వం కీలకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పోలీస్ శాఖకు, స్థానిక ప్రజలకు మధ్య నిరంతరం సమన్వయం, సత్సంబంధాలు ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ కిరణ్‌తో పాటు శ్రీకాంత్, మధు, నవీన్, చిరంజీవి, రత్నాచారి, సతీష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ ప్లాట్స్‌లో ఉచిత వైద్య శిబిరం

ముఖ్యఅతిథిగా పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



శేరిలింగంపల్లి,జులై 28 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి ఎం.ఈరన్న) శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గోకుల్ ప్లాట్స్, వెంకటరమణ కాలనీలో మంగళవారం బేరాక చర్చి పాస్టర్ ఏసుపాదం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం వివిధ ఆసుపత్రులకు చెందిన నిపుణులైన వైద్య బృందం, నర్సులు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బీపీ (రక్తపోటు) పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, ఆరోగ్యం ఎంతో బాగుందని, ఇదే జీవనశైలిని కొనసాగించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు చేస్తాయని, ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువ నాయకులు, వార్డు సభ్యులు, చర్చి ప్రతినిధులు, సోదర సోదరీమణులు మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భీమ్ రెడ్డి నగర్ కాలనీలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన

ఎస్ఐఆర్ హెల్ప్ డెస్క్‌ను సందర్శించిన అజయ్ యాదవ్, కొత్త కిషోర్ గౌడ్,సింగిరెడ్డి పద్మారెడ్డి, పోగుల దిలీప్ రెడ్డి

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటర్ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి

నిర్ణీత గడువులోపు ఎస్ఐఆర్ పారములు పూర్తి చేయాలని సూచన..





మేడిపల్లి,జులై 28 .అక్షర టైమ్స్ : (ప్రతినిధి హరి మోహన్ రెడ్డి) మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని భీమ్ రెడ్డి నగర్ కాలనీలో ఎస్ఐఆర్ ప్రక్రియ శరవేగంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, తదితరులు భీమ్ రెడ్డి నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లోని ఎస్ ఐ ఆర్ హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఓటర్లకు ఎస్ఐఆర్ ఫారం లు అందించారు. అనంతరం ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని బిఎల్ఓ లకు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను నిర్ణీత సమయంలో సమర్పించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు రాకేష్, అనిత ,సుశీల, బాబు, నరేందర్, బిఎల్ఏ లు, డివిజన్ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పార్క్‌కు పూర్వ వైభవం..

కర్రి సూరారెడ్డి సేవకు ప్రజల ప్రశంసల వెల్లువ





గోకవరం,**జులై 28 .అక్షర టైమ్స్ :** గోకవరం ప్రధాన రహదారిలో ఉన్న గాంధీ పార్క్‌ను స్వచ్ఛందంగా శుభ్రపరచిన ఏ వన్ చికెన్ సెంటర్ అధినేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రి సూరారెడ్డి మాట్లాడుతూ, “మహాత్మా గాంధీ దేశానికి చూపిన మార్గం స్వచ్ఛత, సేవ, క్రమశిక్షణ. అలాంటి మహనీయుడి విగ్రహం ఉన్న ప్రదేశం అపరిశుభ్రంగా ఉండడం బాధ కలిగించింది. అందుకే ఎవరైనా చేస్తారనే ఎదురుచూడకుండా, మన బాధ్యతగా భావించి మా సిబ్బందితో కలిసి పార్కును పూర్తిగా శుభ్రం చేయించాం” అని అన్నారు. “ప్రభుత్వం ఒక్కటే అన్ని పనులు చేయాలనే భావన కాకుండా, ప్రతి పౌరుడు తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యత తీసుకోవాలి. సమాజం కోసం మన వంతు సేవ చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. గోకవరం అందంగా, పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజలందరూ కలిసి ముందుకు రావాలి” అని ఆయన పిలుపునిచ్చారు. అలాగే, “గాంధీ పార్క్‌ను పరిశుభ్రంగా ఉంచడం అందరి బాధ్యత. మళ్లీ చెత్తాచెదారం వేయకుండా ప్రజలు సహకరించాలని, ఈ పార్కును ప్రతి ఒక్కరూ తమ సొంత ఆస్తిలా భావించి కాపాడాలని” సూరారెడ్డి విజ్ఞప్తి చేశారు. గత కొన్ని నెలలుగా పొదలు, చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయిన పార్కును పూర్తిస్థాయిలో శుభ్రం చేయడంతో పాటు గాంధీ విగ్రహ పరిసరాలను కూడా అందంగా తీర్చిదిద్దారు. శుభ్రపరిచే ముందు, తర్వాత తీసిన ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మండల ప్రజలు కర్రి సూరారెడ్డి సేవా కార్యక్రమాన్ని అభినందిస్తూ ప్రశంసల వర్షం కురిపించారు. పొదలతో నిండిపోయిన గాంధీ పార్క్‌కు తిరిగి పూర్వ వైభవం తీసుకురావడం లి”నాడు--నేడు”లిను గుర్తు చేసేలా ఉందని స్థానికులు పేర్కొంటూ, సమాజానికి ఆదర్శంగా నిలిచిన ఈ కార్యక్రమాన్ని కొనియాడారు.

డాక్యుమెంట్ రైటర్లకు సంఘీభావం తెలిపిన సిపిఐ నాయకులు

తొమ్మిదవ రోజుకు చేరిన ‘పెన్ డౌన్’ నిరసన కార్యక్రమం





కావలి**జులై 28 .అక్షర టైమ్స్ :** జీవో 396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కావలి డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన ‘పెన్ డౌన్’ నిరసన కార్యక్రమం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసనకు సిపిఐ సీనియర్ నాయకులు బిల్లా పురుషోత్తం మరియు ఇతర ముఖ్య నాయకులు హాజరై తమ పూర్తి సంఘీభావాన్ని తెలియజేశారు. అనంతరం బిల్లా పురుషోత్తం మాట్లాడుతూ. “పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత మరియు ప్రభుత్వ గుర్తింపు లేకపోయినప్పటికీ, డాక్యుమెంట్ రైటర్లు స్వతహాగా తమ కాళ్లపై తాము నిలబడి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అలాంటి వారిని ‘సాంకేతికత పెంపు’ నెపంతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు దూరం చేసేలా జీవో 396ను ప్రవేశపెట్టడం అత్యంత బాధాకరం. కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆ జీవోను రద్దు చేసేంతవరకు రైటర్లకు అండగా నిలుస్తాం” అని స్పష్టం చేశారు. సమ్మె రోజులు దాటి వారాలు గడుస్తుండటంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు పూర్తిగా నిలిచిపోయాయని ఆయన తెలిపారు. ప్రతిరోజూ వందలాది రిజిస్ట్రేషన్ల జరగాల్సిన చోట, లావాదేవీలు సింగిల్ డిజిట్‌కు పడిపోవడంతో రిజిస్ట్రేషన్ల శాఖ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొండయ్య, దర్గా బాబు, డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు పి.డి.వి.ఎం. ప్రసాద్, అధ్యక్షులు అమెరిశెట్టి వెంకట్రావు, షేక్ చెన్నయ్య, ట్రెజరర్ ఉప్పాల రాంప్రసాద్, జాయింట్ సెక్రెటరీ గుడిపల్లి వెంకట్రావు, జాయింట్ ట్రెజరర్ బెజవాడ ప్రసన్నకుమార్, మంద రాములు, సరరాజు శ్రీనివాసులు, రామకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో సిపిఐ నాయకులు, డాక్యుమెంట్ రైటర్లు మరియు డిటిపి ఆపరేటర్లు పాల్గొన్నారు.

కావలి కాలువ అధికారులపై తీవ్రంగా మండిపడ్డ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి





కావలి,**జులై 28 .అక్షర టైమ్స్ :** నెల్లూరు జిల్లా సోమశిల జలాశయం నుండి కావలి, దగదర్తి జలదంకి కావలి పట్టణానికి త్రాగు, సాగు నీరు అందించే కావలి కాలువకు సంగం మండలం మర్రిపాడు వద్ద గండి పడిన విషయంపై ఎమ్మెల్యే అధికారులపై మండిపడ్డాడు. 67.619 కిలోమీటర్ల పొడవు కలిగిన 1.2 లక్షల మందికి తాగు, సాగు నీరు అందిస్తున్న కావలి కాలువ ఎగువ నుండి 650 కుసెక్కుల నీడు దిగు ఒక విడుదల చేయడంతో మర్రిపాడు వద్ద పెద్ద బ్రిడ్జికి గండి పడింది. పెద్ద బ్రిడ్జి స్లాబ్ కింద భాగాన ఎయిర్ క్రాక్స్ కారణంగా మూడు రోజుల నుంచి వృధాగా నీరు పోతున్నాయి. మూడు రోజులుగా వృధాగా పోతున్న పట్టించుకోని అధికారులపై మండిపడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారం పై మర్రిపాడు వద్ద గండిపడ్డ అంశంపై కాలును ఎమ్మెల్యే పరిశీలించారు. అధికారుల నిర్లక్ష్యం వహించిన కారణంగా అధికారులపై మండి పడ్డారు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని తక్షణమే గండి పడ్డ కావలి కాలువకు కాంక్రీట్ మిక్సర్ తో మరమ్మతులను ఎమ్మెల్యే దగ్గరుండి చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శరవేగంగా సాగుతున్న కాలువ తాత్కాలిక మరమ్మత్తుల పనులు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఎమ్మెల్యే ఫోన్ చేసి అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేసి రైతులు ఆదుకోవాలని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. పురాతన బ్రిడ్జి కావడంతో ఒక్కసారిగా ఎగువ నుంచి భారీగా నీరు రావడంతో దిగువకు పోయే మార్గానికి సరైన మార్గం లేకపోవడంతోనే క్రాక్స్ వచ్చినట్లు సమాచారం. అధికారుల నిర్లక్ష్యం వల్లే కావలి కాలువపై 12వ కిలోమీటర్ దగ్గర ఉన్న సైఫన్ దాదాపు 25 రోజులుగా దెబ్బతిని నీరు సముద్రంపాలవుతోంది అని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. సైఫన్ దెబ్బతిన్న విషయాన్ని కలెక్టర్, ప్రజాప్రతినిధులు లేదా తమ దృష్టికి తీసుకురావడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు అన్నారు. సమస్య తెలియగానే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సైఫన్ మరమ్మతుల కోసం తక్షణమే 27 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయించాము అన్నారు. కాలువ కింద ఉన్న సుమారు లక్ష ఎకరాల ఆయకట్టుకు, సాగునీటి సరఫరాకు తీవ్ర విఘాతం కలిగింది అని, స్థానిక రైతుల సహకారంతో సైఫన్ పునరుద్ధరణ పనులను వెంటనే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, కాలువ కింద ఉన్న రైతులందరూ ఒకరికే ఎక్కువ నీరు నివ్వ చేసుకోకుండా, ఆరుతడు లతో నీటిని వాడుకుంటూ సమన్వయం పాటించాలని విజ్ఞప్తి చేశారు. రాబోయే రెండు మూడు రోజుల్లోనే మరమ్మతులు పూర్తి చేసి కావలి కాలువ కింద రైతాంగానికి, తాగునీటికి ఇబ్బంది లేకుండా తిరిగి నీటిని అందిస్తాం అని ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట పలువురు నేతలు ఉన్నారు.

కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలు



గిద్దలూరు,జులై 28 .అక్షర టైమ్స్ : -(రిపోర్టర్ మల్లాపురం సాగర్) మార్కాపురంజిల్లా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అదేశలమేరకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి సూచనలతో గిద్దలూరు నగర పంచాయతీలోని 17 వార్డు, నల్లబండ బజార్, 199 వ బూత్‌లో నిర్వహించిన డోర్ టు డోర్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గిద్దలూరు అబ్సర్వర్ డాక్టర్ గుమ్మిడిపూడి దశరథా చారి మరియు వార్డు అధ్యక్షులు పిడతల రవితేజ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ., అభివృద్ధికి చిరునామా – సంక్షేమానికి భరోసా.. నమ్మకానికి మరో పేరు కూటమి ప్రభుత్వం” అని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి, ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తోందని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని,ప్రతి ప్రాంతం మా బాధ్యత... ప్రతి కుటుంబం మా ప్రాధాన్యం అనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అలాగే గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గిద్దలూరు మద్దిలేటి, ఈశ్వరయ్య, విబుది మౌలాలి,బొర్రా రాఘవేంద్ర యాదవ్, ఐటీడీపి స్టేట్ ఆర్గనైజేషన్ సెక్రటరీ దూదేకుల దస్తగిరి, షేక్ ఫాతిమా, వెలుతుర్ల మల్లీశ్వరి ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాంచజన్యంతో ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం

టీఆర్ఎస్ మల్కాజ్గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి వేముల భవాని





కాప్రా,జులై 28 .అక్షర టైమ్స్ : (జిల్లా ప్రతినిధి గోపగాని పాండు) తెలంగాణలో ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన అభివృద్ధి అందించడమే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రధాన లక్ష్యమని పార్టీ మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన వేముల భవాని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధిని కేంద్రబిందువుగా చేసుకుని పార్టీ ముందుకు సాగుతోందని ఆమె పేర్కొన్నారు.మంగళవారం కాప్రా ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి మల్కాజ్గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు.వేముల భవాని మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన ఆవిర్భవించి కేవలం మూడు నెలలు మాత్రమే అయినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన, ఆదరణ లభించడం పార్టీపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడే ప్రత్యామ్నాయ రాజకీయ వేదికగా తెలంగాణ రక్షణ సేన ఎదుగుతోందని ఆమె పేర్కొన్నారు.పార్టీ ప్రకటించిన “పాంచజన్య” కార్యక్రమం సామాజిక న్యాయానికి ప్రతీకగా నిలుస్తుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉచిత విద్య, ఉచిత వైద్యం, రైతుకు గౌరవప్రదమైన జీవనం, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల సాధికారత, వెనుకబడిన వర్గాలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలను కార్యాచరణలో అమలు చేస్తామని తెలిపారు. తెలంగాణలో ప్రతి కుటుంబానికి అభివృద్ధి ఫలాలు చేరేలా పార్టీ కార్యాచరణ ఉంటుందన్నారు.పార్టీ నిర్మాణంలో కూడా సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యత కల్పించారని, అన్ని సామాజిక వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ పార్టీ పదవుల పంపిణీ జరగడం విశేషమని వేముల భవాని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తూ రాజకీయాల్లో కొత్త సంస్కృతికి కల్వకుంట్ల కవిత శ్రీకారం చుట్టారని కొనియాడారు.కల్వకుంట్ల కవిత ప్రకటించిన పాంచజన్య సూత్రాలు భవిష్యత్తు తెలంగాణ రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని, ప్రజల విశ్వాసాన్ని సంపాదించిన ఆమె రానున్న రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల ఆశయాలను నెరవేర్చే నాయకత్వం కవితదేనని ఆమె అభిప్రాయపడ్డారు. మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై నిరంతర ఉద్యమాలు చేపడతామని, నిరుద్యోగం, రైతు సమస్యలు, మహిళల భద్రత, విద్య, వైద్యం, తాగునీరు, మౌలిక సదుపాయాల వంటి అంశాలపై ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు. అంతకుముందు ఈసీఐఎల్ చౌరస్తాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, పార్టీ విజయానికి ఆకాంక్షిస్తూ నాయకులు నినాదాలు చేశారు. ఈ సమావేశంలో టీఆర్ఎస్ ఉప్పల్ ఇన్‌చార్జి శ్రమన్ దేవ్, రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు వల్లపు శివకుమార్, పార్టీ నాయకులు దికొండ కవిత, చీర మహేష్, పద్మ రమాదేవి, జ్యోత్స్న, పద్మజ, బాలకృష్ణ, విజయలక్ష్మి, వంశీ, కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొని పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేస్తామని తెలిపారు.

కొండాపూర్, అంజయ్య నగర్ డివిజన్లలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్





కొండాపూర్,జులై 28 .అక్షర టైమ్స్ :-(ప్రతినిధి ఎం.ఈరన్న) భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా, నూతనంగా ఏర్పడిన కొండాపూర్, అంజయ్య నగర్ డివిజన్లలోని ఓటర్ల వివరాల సేకరణ కేంద్రాలను కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పోలింగ్ కేంద్రాలలోని బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియ పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలు పంపిణీ చేయడం, వివరాలు సేకరించడం మరియు ఓటర్లతో సమన్వయం చేసుకుంటున్న తీరును ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో ముఖ్య అంశాలు

సూచనలు:

ఖచ్చితమైన నమోదు: ప్రతి ఇంటి వివరాలను ఎలాంటి అయోమయానికి తావులేకుండా ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.

సమయపాలన:

ఇప్పటివరకు సేకరించిన దరఖాస్తుల సంఖ్య, పెండింగ్ వివరాలను సమీక్షించి, నిర్దేశిత గడువులోగా వంద శాతం నమోదు సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.

అంతర్జాలంలో నమోదు:

సేకరించిన దరఖాస్తులను అదే రోజు గణకీకరణ చేసి అంతర్జాలంలో నమోదు చేయాలని, ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకూడదని అధికారులు, పర్యవేక్షకులకు స్పష్టం చేశారు.

ప్రజలకు విజ్ఞప్తి:

ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, సరైన వివరాలతో కూడిన ఓటరు జాబితాతోనే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని హమీద్ పటేల్ పేర్కొన్నారు. ఇంటింటికీ వచ్చే బూత్ స్థాయి అధికారులకు అవసరమైన సమాచారం, ధృవీకరణ పత్రాలు అందించి సహకరించాలని ప్రజలను కోరారు. పేరు, చిరునామా, వయస్సు వంటి వివరాల్లో మార్పులు ఉంటే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ద్వారా సరిచేసుకోవచ్చని తెలిపారు. సమయం దగ్గర పడుతున్నందున అర్హులైన ప్రజలందరూ అలసత్వం వహించకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

లాభదాయకం లేకుండాఈటూరు గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..

సర్పంచ్ దామోదర్ మళ్లీ సర్పంచ్గా ఉంటా..

గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా..





తిరుమలగిరి/నాగారం,జులై 28 .అక్షర టైమ్స్ : సూర్యాపేట జిల్లానాగారం మండలం ఈటూరు గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని స్థానిక సర్పంచ్ వంగూరి దామోదర్ అన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... వంగరి సంస్థను 2018లో ప్రారంభించి అనేక పేద కుటుంబాలకు ఆదుకున్నామని అన్నారు. కరోనా టైం లో ప్రాణాలు లెక్క చేయకుండా నిరుపేదలకు నిత్యవసర సరుకులు, విద్యార్థులకు డ్రెస్సులు, బ్యాగులు, చనిపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. వంగూరిఫౌండేషన్ ద్వారా గ్రామంలో బతుకమ్మ పండుగ, బోనాలు, ఆలయాలు నిర్మాణం, విద్యార్థులకు కావలసిన సామాగ్రిని, గ్రామంలో చనిపోయిన కుటుంబాలకు ఫౌండేషన్ ద్వారా అందజేశామని అన్నారు. గత పాలకుల వల్లఈటూరు గ్రామంలో ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. అందుకే గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేశానని అన్నారు. గ్రామశీ లో ప్రజలు సమస్యలు తెలిపారు. గ్రామానికి ఉన్న విద్య, మంచినీటి సమస్య , మురికి కాలువలు, సీసీ రోడ్లు, నూతన గ్రామ పంచాయతీ భవనం, వాటర్ ప్లాంట్ తదితర సమస్యలుతెలిపారు . నన్ను గ్రామ సర్పంచ్ గా గెలిపిస్తే గ్రామంలోని ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ప్రజలు నమ్మి సర్పంచ్ ఎన్నికల్లో గెలిపించారు. మాట ప్రకారమే తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో గ్రామంలో సిసి రోడ్లు లింకు రోడ్లునిర్మాణ పనులు చేపట్టమని, మురికి కాలువల డ్రైనేజీనిర్మాణం పనులు చేపట్టామని, వంటి ఒక్కొక్కటిగా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తున్నామని అన్నారు. అదేవిధంగా పాఠశాలలో చదవడానికి పోరుగురు నుంచి ఈటూరు గ్రామానికి పాఠశాలకు రావడానికి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి వెంటనే స్పందించి విద్యార్థులకు చదవడానికి ఆటో సౌకర్యం కల్పించామని అన్నారు. గ్రామంలో ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ మీద యువత వాటి జోలి పోకుండా అవగాహన కల్పించి మంచి మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని అన్నారు. గ్రామంలో పాఠశాల 220 విద్యార్థులకు సొంత నిధులతో స్కూలు యూనిఫాము పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో వన మహోత్స లో కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 1700 మొక్కలు నాటామని అన్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ గ్రామంలో ఒక ఊరు నుంచి ఇంకో ఊరికి పోవడానికి రాకపోకలకు రోడ్లు ,అద్వానంగా మారాయని , అదేవిధంగా నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణశీ, అంగన్వాడి భవనం, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని ఎమ్మెల్యేకుచెప్పడం జరిగిందనీ అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గ్రామంలోని నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని సర్పంచ్ తెలిపారు. ఎలాంటి లాభదాయకం లేకుండా గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈటూరు గ్రామాన్ని తీర్చి దిద్దడానికి మళ్లీ సర్పంచే ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్ గా నిలబడతానని అన్నారు. ఈటూరు గ్రామాన్ని రాజకీయాల పార్టీల అతీతంగా గ్రామ అభివృద్ధి కోసం ఆదర్శవంతంగా తీర్చు దిద్దడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో నానో ఎరువుల విస్తరణకు కేంద్రం మరింత ప్రోత్సాహం అందించాలి

రాజ్యసభలో ప్రశ్నించిన డా" బీద మస్తాన్ రావు



నెల్లూరు,**జులై 28 .అక్షర టైమ్స్ :** దేశవ్యాప్తంగా నానో యూరియా, నానో డీఏపీ తదితర నానో ఎరువుల వినియోగం, ఆంధ్రప్రదేశ్‌లో రైతులలో అవగాహన కార్యక్రమాలు, నానో ఎరువుల తయారీ పరిశ్రమలకు కేంద్ర ఆర్థిక సహాయం, రాష్ట్రంలో ప్రదర్శన కార్యక్రమాల విస్తరణపై రాజ్యసభలో డా. బీద మస్తాన్ రావు యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ సమాధానం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సమాధానం ప్రకారం, ప్రస్తుతం నానో యూరియా, నానో డీఏపీ, నానో ఎన్‌పీ, నానో ఫాస్పరస్, నానో ఎన్‌పీకే, నానో జింక్, నానో కాపర్ తదితర మొత్తం 32 నానో ఎరువులు ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు (ఎఫ్.సి.ఓ-1985) కింద నోటిఫై చేయబడ్డాయి. శాస్త్రీయ వ్యవసాయ ప్రయోగాలు, బయోసేఫ్టీ పరీక్షలు, నాణ్యత ప్రమాణాల ఆధారంగా మాత్రమే వీటికి అనుమతి ఇవ్వబడుతుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. అయితే, నానో ఎరువుల తయారీ యూనిట్ల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఎటువంటి ప్రత్యక్ష ఆర్థిక సహాయం లేదా సబ్సిడీ అందించడం లేదని సమాధానంలో పేర్కొంది. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నానో యూరియా, నానో డీఏపీపై 50 శాతం సబ్సిడీ అందిస్తుండగా, రాజస్థాన్‌లో స్ప్రేయింగ్ ఖర్చుపై 50 శాతం సబ్సిడీ, ఉత్తరాఖండ్‌లో పలు ప్రభుత్వ పథకాల కింద నానో ఎరువుల వినియోగాన్ని తప్పనిసరి చేసినట్లు కేంద్రం వివరించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2025--26 సంవత్సరంలో 268 నానో యూరియా రైతు క్షేత్ర ప్రయోగాలు నిర్వహించడంతో పాటు, 88,375 అవగాహన కార్యక్రమాల ద్వారా సుమారు 23.99 లక్షల మంది రైతులకు నానో ఎరువులపై అవగాహన కల్పించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా రైతు సమావేశాలు, ఫీల్డ్ డెమోన్స్ట్రేషన్లు, కిసాన్ మేళాలు, పంట సదస్సులు, డిజిటల్ ప్రచార కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించినట్లు వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం సమాధానం ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలకు కూడా నానో ఎరువుల ప్రదర్శన కార్యక్రమాలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. అలాగే నానో ఎరువుల తయారీ సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా 5,448 ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి రైతులకు ప్రత్యక్షంగా నానో ఎరువుల ప్రయోజనాలను వివరించినట్లు తెలిపింది. ఈ సందర్భంగా డా. బీద మస్తాన్ రావు యాదవ్ మాట్లాడుతూ భవిష్యత్ వ్యవసాయానికి నానో ఎరువులు అత్యంత కీలకమైన సాంకేతికతగా మారుతున్నాయని అన్నారు. తక్కువ పరిమాణంలో ఎక్కువ ఫలితాలు ఇవ్వడంతో పాటు, ఎరువుల వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, సాగు ఖర్చులను తగ్గించడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో నానో ఎరువులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అయితే, దేశంలోని ఇతర రాష్ట్రాల మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, విస్తృత శిక్షణ కార్యక్రమాలు అందించాలని, అలాగే రాష్ట్రంలో నానో ఎరువుల తయారీ యూనిట్ల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రకటించాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తరించి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి నానో ఎరువుల వినియోగాన్ని గ్రామీణ స్థాయికి తీసుకెళ్లాలని డా. బీద మస్తాన్ రావు యాదవ్ విజ్ఞప్తి చేశారు.

నిర్మాణ రంగానికి నమ్మకమైన చిరునామా.. శివ ఏజెన్సీస్

సొంత ఇంటి కలను సాకారం చేసే నమ్మకమైన భాగస్వామి

ఇంటి పునాదికి బలమైన భరోసా.. నాణ్యమైన సిమెంట్, ఇనుము

సరఫరాలో శివ ఏజెన్సీస్ ప్రత్యేకత

హైదరాబాద్,జులై 28 .అక్షర టైమ్స్ : సొంత ఇంటి నిర్మాణం ప్రతి ఒక్కరి జీవితంలో ఒక గొప్ప కల. ఆ కలను బలమైన పునాదులతో సాకారం చేసుకునేందుకు నాణ్యమైన నిర్మాణ సామగ్రి ఎంతో కీలకం. ఈ అవసరాన్ని గుర్తించి నిర్మాణ రంగానికి నమ్మకమైన సేవలను అందిస్తూ ముందుకు సాగుతోంది శివ ఏజెన్సీస్. హైదరాబాద్ నగర పరిధిలో గత కొన్నేళ్లుగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిన శివ ఏజెన్సీస్ ద్వారా గృహ నిర్మాణాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణాలకు అవసరమైన నాణ్యమైన సిమెంట్, ఇనుము తదితర నిర్మాణ సామగ్రిని సరసమైన ధరలకు అందిస్తున్నారు. నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రముఖ కంపెనీలకు చెందిన సిమెంట్‌ను వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నారు. అల్ట్రాటెక్, ప్రియా, మహా, బిర్లా శక్తి, బంగూర్ వంటి నాణ్యమైన సిమెంట్ రకాలతో పాటు భవన నిర్మాణాలకు అవసరమైన వివిధ పరిమాణాల బలమైన ఇనుప కడ్డీలను సరఫరా చేస్తున్నారు.

నాణ్యత.. నమ్మకం.. సకాలంలో సరఫరా శివ ఏజెన్సీస్ ప్రత్యేకత

నిర్మాణదారులు, గృహ యజమానుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని శివ ఏజెన్సీస్ తక్కువ ధరలకు నాణ్యమైన సరుకులను అందిస్తోంది. చిన్న ఆర్డర్ అయినా, పెద్ద మొత్తంలో నిర్మాణ సామగ్రి అవసరమైనా హైదరాబాద్ పరిధిలో సకాలంలో సరఫరా చేసే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వినియోగదారులకు సరసమైన ధరలు, అసలైన నాణ్యమైన సరుకు, వేగవంతమైన రవాణా సేవలు అందించడం తమ లక్ష్యమని సంస్థ నిర్వాహకులు తెలిపారు.

"మీ ఇంటి పునాదికి మా నాణ్యతే భరోసా"



నిర్మాణ రంగంలో నాణ్యతతో కూడిన సేవలను అందిస్తూ వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని శివ ఏజెన్సీస్ నిర్వాహకులు బి. సత్యనారాయణ పేర్కొన్నారు.నిర్మాణ పనులు చేపట్టే వారు ఉత్తమ ధరలు, నాణ్యమైన నిర్మాణ సామగ్రి కోసం తమను సంప్రదించాలని ఆయన కోరారు.

సంప్రదించండి:

నిర్వాహకులు:

బి. సత్యనారాయణ చరవాణి: 9391237962, 7780248472 ఈమెయిల్:

shivaagencies143@gmail.com

చిరునామా:

ప్లాట్ నంబర్ 235, హెచ్.ఏ.ఎల్ లేఅవుట్, కొండాపూర్, హైదరాబాద్ -- 500084.

శివ ఏజెన్సీస్.. నిర్మాణానికి నాణ్యత, నమ్మకానికి చిరునామా.

మహిళ మెడలో 28 గ్రాముల బంగారు గొలుసు అపహరణ

బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగుల చైన్ స్నాచింగ్

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ వెంకట్రావు



పొదలకూరు,జులై 28 .అక్షర టైమ్స్ :(రిపోర్టర్ ఆనంద్) పొదలకూరు మండలంలోని బిరదవోలు చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. ఓ మహిళ మెడలో ఉన్న సుమారు 28 గ్రాముల బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు అపహరించి పరారయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి.బాధితురాలి కథనం ప్రకారం, ఆమె తన ఇంటి నుంచి సమీపంలోని అత్తగారింటికి కాలినడకన వెళ్తుండగా, వెనుక నుంచి మోటార్‌సైకిల్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు కొంతదూరం ఆమెను వెంబడించారు. అనంతరం ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును బలవంతంగా లాక్కొని వేగంగా అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఆకస్మిక ఘటనతో మహిళ తీవ్ర భయాందోళనకు గురై గట్టిగా కేకలు వేయగా, స్థానికులు అక్కడికి చేరుకునేలోపే దుండగులు తప్పించుకున్నారు.బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, అపహరణకు గురైన బంగారు గొలుసు సుమారు 28 గ్రాముల బరువు ఉండగా, దాని విలువ దాదాపు రూ. 4 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఘటనపై కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పొదలకూరు సీఐ వెంకట్రావు పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. బాధితురాలు, స్థానికుల నుంచి వివరాలు సేకరించి విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒంటరిగా ప్రయాణించే సమయంలో విలువైన నగలను బహిరంగంగా ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ప్రజలు అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం నేడు తీరం దాటే ఛాన్స్

వాయవ్య బంగాళాఖాతంలో మరింత బలపడిన వాయుగుండం

హల్దియా సమీపంలో ఇవాళ తీరం దాటనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడి

ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలకు అవకాశం

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మరింత తీవ్రరూపం దాల్చింది. మంగళవారం నాటికి ఇది తీవ్ర వాయుగుండంగా బలపడి తీరం వైపు దూసుకొస్తోంది. ప్రస్తుతం ఇది సముద్రంలో ఉత్తర దిశగా పయనిస్తూ, ఒడిశాలోని బాలాసోర్, బంగాల్‌లోని హల్దియా ప్రాంతాల మధ్య కేంద్రీకృతమై ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.హల్దియా సమీపంలో తీరం దాటే అవకాశం తీవ్ర వాయుగుండం గమనంపై వాతావరణ శాఖ అధికారులు కీలక ప్రకటన చేశారు. మంగళవారం ఉదయం ఇది పశ్చిమ బెంగాల్‌లోని హల్దియాకు సమీపంలో తీరాన్ని తాకనుందని స్పష్టం చేశారు. తీరం దాటే సమయంలో సముద్రం తీవ్ర అలజడిగా ఉంటుందని, వాతావరణంలో ఒక్కసారిగా పెను మార్పులు చోటుచేసుకుంటాయని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ జిల్లాల్లో మోస్తరు వర్షాలు తీవ్ర వాయుగుండం ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనా కనిపిస్తోంది. దీని ఫలితంగా ఏపీలోని పలు జిల్లాల్లో వర్షాలు కురవనున్నాయి. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, పోలవరం జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వెల్లడించింది. ఈ ప్రాంతాల ప్రజలు చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని అధికారులు సూచించారు.మరికొన్ని జిల్లాల్లో తేలికపాటి జల్లులు రాష్ట్రంలోని మరికొన్ని జిల్లాల్లో వాతావరణం చల్లబడనుంది. తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపారు. వీటితో పాటు బాపట్ల, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లోనూ చెదురుమదురుగా వానలు కురవచ్చని వాతావరణ శాఖ పేర్కొంది.ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు తీవ్ర వాయుగుండం తీరం దాటనున్న నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తమైంది. సముద్రం అల్లకల్లోలంగా ఉండటం, అలలు ఎగసిపడుతుండటంతో ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం నుంచి కాకినాడ వరకు ఉన్న ఓడరేవుల్లో మూడో నంబరు ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. అలాగే మిగిలిన కోస్తా తీరంలోని ఓడరేవుల్లో ఒకటో నంబరు ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. వాతావరణం శాంతించే వరకు మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



అన్నదాతలకు అలర్ట్ పంటల బీమా నమోదుకు సమీపిస్తున్న గడువు మిగిలింది మూడు రోజులే

రాష్ట్రవ్యాప్తంగా 15.25 లక్షల ఎకరాలకే ప్రీమియం చెల్లించిన రైతులు

ఎల్‌నినో తరుముతున్నా మేల్కొనని వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు

పంటల బీమా నమోదుకు ఇంకా మూడు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది. అయినప్పటికీ, కొన్ని జిల్లాల్లో నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా రెండు బీమా పథకాల కింద కేవలం 15.25 లక్షల ఎకరాలకు మాత్రమే రైతులు ప్రీమియం చెల్లించారు. కొన్ని జిల్లాలు, మండలాల్లో ఈ సంఖ్య సున్నాగానే ఉంది. 'ఎల్ నినో' ముప్పు పొంచి ఉన్నప్పటికీ, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. అలాగే ప్రజాప్రతినిధులు కూడా దీనిపై ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. రైతులు పంటల బీమాను ఎంచుకునేలా ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తే, కరువు కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు వారికి పరిహారం పొందే అవకాశం ఉంటుంది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లోనే 60 శాతం: పంటల బీమా నమోదులో కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులు ముందున్నారు. ముఖ్యంగా, బీమా చేసిన మొత్తం 15.25 లక్షల



ఎకరాలలో ఈ రెండు జిల్లాల వాటానే 60 శాతంగా ఉంది. నంద్యాల, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో నమోదు గణాంకాలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, మిగిలిన జిల్లాల్లో మాత్రం చాలా తక్కువగా ఉన్నాయి. ప్రధానంగా 'ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన' విషయానికొస్తే, 12 జిల్లాల్లో జిల్లాకు సగటున 1,000 ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణానికే బీమా చేశారు. అలాగే 'వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం' కింద తొమ్మిది జిల్లాల్లో సగటు నమోదు 500 ఎకరాల కంటే తక్కువగా ఉంది. పంటల బీమా నమోదుకు (జూలై చివరి వరకు) ఇంకా మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అయితే, వరి పంటకు మాత్రం గడువు తేదీ ఆగస్టు 15 వరకు ఉంది. ఎక్కువ విస్తీర్ణంలో పంటల బీమా కవరేజీని కల్పించడం ద్వారా రైతులకు కొంత మేరకైనా ప్రయోజనం చేకూరుతుంది. కొన్ని జిల్లాల్లో ప్రీమియంలు ఎక్కువగా ఉన్నాయి. అటువంటి ప్రాంతాల్లో ప్రభుత్వమే కొంత భారాన్ని తన వాటాగా భరించడం ద్వారా రైతులను ప్రోత్సహించాలి. ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగ, కందులు, పత్తి, మిరప, మినుములు ,మొక్కజొన్న వంటి పంటలను విస్తృతంగా సాగు చేస్తారు. అయినప్పటికీ, కొన్ని జిల్లాల్లో నమోదు ప్రక్రియ నామమాత్రంగానే ఉంది. 2024 ఖరీఫ్ తో పోల్చితే 21.42 శాతమే 2024 ఖరీఎ లో రాష్ట్రవ్యాప్తంగా బీమా 71.17 లక్షల ఎకరాలు ఈ ఏడాది ఇప్పటి వరకు 15.25 లక్షల ఎకరాలు 2024తో పోల్చితే 21.42 % మాత్రమే తక్కువ ప్రీమియంలు ఉన్నప్పటికీ కొన్ని పంటలకు ప్రీమియంలు చాలా తక్కువగా ఉన్నాయి. మిరప సాగు విస్తృతంగా జరిగే పల్నాడు జిల్లాలో, ఎకరాకు బీమా ప్రీమియం కేవలం రూ.360 మాత్రమే. వైఎస్ఆర్ కడప జిల్లాలో, ఎకరా కంది పంటకు ప్రీమియం కేవలం రూ.36 మాత్రమే ఉంది. అయినప్పటికీ, అవగాహన లేకపోవడం వల్ల రైతులు ఇందులో నమోదు చేసుకోవడం లేదు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎకరం వరి పంటకు ప్రీమియం కేవలం రూ.76 మాత్రమే ఉన్నప్పటికీ, పథకం కింద కేవలం 15,000 ఎకరాలకు మాత్రమే పంట బీమా చేశారు.వరి సాగు విస్తృతంగా జరిగే అవిభక్త కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో పంట బీమా నమోదు చాలా తక్కువగా ఉంది.


అదే నేను చేసిన తప్పు హైకోర్టు ఉత్తర్వులపై స్పందించిన హైడ్రా కమిషనర్

హైడ్రా కమిషనర్ గా రంగనాథ్ ను తప్పించాలని హైకోర్టు ఆదేశం

ఈ నేపథ్యంలో స్పందించిన రంగనాథ్

ఎదుర్కొంటానని వెల్లడి

రాజ్యాంగ స్ఫూర్తితో పనిచేస్తానని హైడ్రా కమిషనర్ స్పష్టం



తనపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు బడా భూ కబ్జాదారులు వేసినవేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. సామాన్యుల ప్లాట్లను, ప్రభుత్వ భూములను ఆక్రమించాలని చూస్తున్న బడా భూకబ్జాదారులను అడ్డుకుంటున్నందుకే తనపై కోర్టు ధిక్కరణ కేసులు వేశారని, రాజ్యాంగ స్ఫూర్తితో పని చేస్తూ, ప్రభుత్వం తనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా వంద శాతం ఫలితాలు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. తనను హైడ్రా కమిషనర్? పదవి నుంచి తప్పించాలంటూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో రంగనాథ్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. అందులో ఆయన పేర్కొన్న అంశాల ఇలా ఉన్నాయి. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారు రెండేళ్ల కాలంలో హైడ్రా కమిషనర్‌గా రాజ్యాంగ స్ఫూర్తిని అనుసరించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21, 48ఎ ప్రకారం పనిచేస్తున్నట్లు రంగనాథ్ చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో మార్కెట్ విలువ ప్రకారం రూ.1.5 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులను రక్షించినట్లు తెలిపారు. ఆరు చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని అన్నారు. బడాబాబులు, ల్యాండ్‌మాఫియాలు ఆక్రమించిన వందల చెరువులు, వేల ఎకరాల సర్కారు భూములు, పార్కులు హైడ్రా వెనక్కి తెచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించిందన్నారు. భూమాఫియా, భూకబ్జాదారులు తప్పుడు సమాచారంతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేవ్ ద రాక్ సొసైటీ ఫిర్యాదుతోనే అక్కడికి హైడ్రా : మల్కాజిగిరి మండలంలోని లోతుకుంట భూమి విషయంలో దాదాపు రూ.10 వేల కోట్ల విలువైన భూమిని శాంతా శ్రీరాం అనే రియల్ ఎస్టేట్‌కంపెనీ కొట్టేయాలని చూసిందన్న ఏవీ రంగనాథ్ అనుమతులు లేకుండా ఎన్నో ఏళ్లనాటి వారసత్వ గుట్టలను పేల్చివేస్తూ, వందల చెట్లను ధ్వంసం చేసిందని మండిపడ్డారు. సేవ్ ద రాక్ సొసైటీ, పర్యావరణవేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అక్కడ రంగంలోకి దిగిందన్నారు. ఎక్కడో మూడు కిలోమీటర్ల దూరంలో ఉండాల్సిన భూమిని ఇక్కడ ఉన్నట్లు చూపిస్తూ ఈ శాంత శ్రీరాం సంస్థ 120 ఎకరాల ప్రభుత్వ భూమిలోకి ప్రవేశించి, ఆక్రమించి, అడ్డుకున్నందుకు తనపై కోర్టు ధిక్కరణ కేసు వేసిందని తెలిపారు. సంచలన ఆరోపణలు చేసిన రంగనాథ్ అంబర్ పేటలోని బతుకమ్మ కుంట చెరువును మింగేయాలని చూసింది ఒకరైతే లోతుకుంటలో రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కొట్టేయాలని చూసింది ఇంకొకరని రంగనాథ్ ప్రకటనలో పేర్కొన్నారు. సామాన్యుల ప్లాట్లు కొట్టేసి, బడా కాంప్లెక్సులు నిర్మించాలని చూసింది మరొకరైతే, వేల సంఖ్యలో ఉన్న సింగరేణి కార్మికుల ప్లాట్లు కాజేయాలని చూసింది వేరొకరని ఆయన పలు సంచలన ఆరోపణలు చేశారు. మాఫియాగా చలామణి అవుతూ రూ.వేల కోట్ల విలువైన సామాన్యుల ప్లాట్లు, ప్రభుత్వ భూములు ఆక్రమించింది ఇంకొకరని మండిపడ్డారు. వీరందరికీ హైడ్రా కమిషనర్‌గా తను అడ్డుపడటమే చేసిన తప్పు అని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై ఉన్న 63 ధిక్కరణ కేసులు వీళ్లు వేసినవేనని చెప్పారు. వాటిని తాను చట్టబద్ధంగానే ఎదుర్కొంటానని, న్యాయస్థానాలపై పూర్తి నమ్మకం ఉందని పేర్కొన్నారు.

ఎన్యూమరేషన్ ఫారం తిరిగివ్వని ఓటర్లు

హైదరాబాద్ లో భారీగా ఓట్ల రద్దు


కంటోన్మెంట్‌లో 40 శాతం ఓట్లు రద్దు కేటగిరీలోకి

క్యూర్‌లోని పలు నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి

ఆగస్టు 3 వరకు గడువుందని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరు

డిజిటలైజేషన్‌లో వేగం పెంచిన సిబ్బంది

రాజధాని హైదరాబాద్‌లో ఓటర్ల సంఖ్య భారీగా తగ్గబోతోందంటే మీరు నమ్ముతారా కానీ ఇప్పుడు జరిగే వాస్తవం మాత్రం ఇదే. హైదరాబాద్‌లో నకిలీ ఓట్లు భారీగా ఉన్నాయి. అదే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారు కూడా గతంలో ఇక్కడ ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో వారికి సొంత రాష్ట్రంలో సైతం ఓటు ఉంది. ఇలాంటి సమస్యలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చెక్ పెట్టేస్తుంది. రెండు రాష్ట్రాల్లో ఓటు ఉంటే 2 ఎన్యూమరేషన్ ఫారాలు ఇస్తున్నారు. కానీ ఓటర్లు తమకు నచ్చిన ఏదైనా ఒక దానిని మాత్రమే ఎంచుకోవాలి.లేదంటే రెండేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని ఎన్నికల అధికారులు ముందు నుంచీ చెబుతూనే ఉన్నారు. అవసరమైతే రెండు చోట్ల ఓటు రద్దు కూడా అవుతుందని హెచ్చరిస్తున్నారు. ఈ లెక్కన అప్రమత్తమైన ఓటర్లు తమ సొంత రాష్ట్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీని ప్రకారం హైదరాబాద్‌లో మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల ప్రజలు ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకుని వెనక్కి ఇవ్వడం లేదు. ఈ కారణంతో గరిష్ఠంగా హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు రద్దు కేటగిరీలో చేరనున్నాయి. దాదాపు అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. పత్రాలు తిరిగివ్వడం లేదు ఎన్యూమరేషన్ పత్రాలను తీసుకున్న వారు చాలా మంది వాటిని తిరిగి బీఎల్వోలకు ఇవ్వట్లేదు. ఆగస్టు 3 వరకు గడువుందని చాలా మంది ఇంకా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అయితే చివరి తేదీన సర్వర్ సమస్యలు తలెత్తుతాయనే ఉద్దేశంతో ఉద్యోగులు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌లో వేగం పెంచారు. ఎన్యూమరేషన్ పత్రాలను ఇవ్వని వారి ఓట్లు కూడా ఏఎస్‌డీ జాబితాలోకి వెళ్తున్నాయనే ఆందోళన ప్రస్తుతం వ్యక్తమవుతోంది. అంబర్‌పేటలో అత్యల్పం హైదరాబాద్ జిల్లా పరిధిలోని అంబర్‌పేటలో ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలీకరణ ఇప్పటికే 50 శాతం పూర్తి అయింది. అయితే రద్దు కేటగిరీ ఓట్లు అంబర్‌పేటలో 3 శాతం, కంటోన్మెంట్‌లో 20 శాతంగా ఉండటం గమనార్హం. బీఎల్‌వోల నిర్లక్ష్యమూ ఓటరు జాబితా సవరణలో పలు నియోజకవర్గాల్లో అధికారులూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ స్వీకరణ, డిజిటలీకరణలో సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదు. దీంతో ఇప్పటి వరకు క్యూర్ పరిధిలోని నియోజకవర్గాల్లో 20 శాతం ఓట్లు ఏఎస్‌డీలోకి వెళ్లాయని, మరో వారం రోజుల్లో 40 శాతానికి మించుతుందని స్థానిక యంత్రాంగం అంచనా వేస్తోంది. ఏఎస్‌డీ జాబితాలోకి ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగివ్వని వారితో పాటు ఇల్లు మారిన, మృతి చెందిన (ఏఎస్‌డీ), నియోజకవర్గం మారిన, ఓటర్ల వివరాలను జాబితా నుంచి తీసేస్తారు. అందులో ఎలాంటి సందేహం లేదని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ



కర్ణన్ జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది.హైదరాబాద్ జిల్లాలో మొత్తం ఓట్లు - 47,36,669 ఇప్పటివరకు డిజిటలైజేషన్ పూర్తయినవి - 24,67,704 వాటిలో రద్దు కేటగిరీలో చేరినవి - 4,35,501 (9.19 శాతం) ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాలు నింపేందుకు ఓటర్లకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలమ్‌లో పేరు, ప్రస్తుత అడ్రస్‌ను రాసి ఇవ్వాలని బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వో) చెబుతున్నారు. తర్వాత నోటీసుకు ఏదైనా అధికారిక ధ్రువీకరణ పత్రం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఓటు కచ్చితంగా రద్దవుతుందనే విషయాన్ని అధికారులు పదే పదే గుర్తుచేస్తున్నారు. ఓటరు నమోదు పత్రాలు నింపేందుకు జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంతో పాటు సర్కిల్ ఆఫీసుల్లో హెల్ప్‌లైన్ సెంటర్లు విస్తృతంగా పని చేస్తున్నాయి.

తెలంగాణలో కొత్తగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్

ఇది ఉన్నవారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ఫ్యామిలీ రిజిస్టర్ తయారు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

రేషన్ కార్డుల్లోని డేటా ఆధారంగా కుటుంబ రిజిస్టర్

మీ సేవ ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం

ఫ్యామిలీ రిజిస్టర్ తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డుల్లోని డేటా ఆధారంగా కుటుంబ రిజిస్టర్ సిద్ధం చేయనుంది. ప్రజలకు అవసరమైనప్పుడు మీ సేవ ద్వారా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కేవలం కుటుంబ సభ్యుల వివరాల కోసమేనని, ఆస్తులపై హక్కులకు, లీగల్ హెయర్ నిర్ధారణకు ఉపయోగపడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో కుటుంబ రిజిస్టర్ రానుంది. ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాల కోసం కుటుంబ వివరాల ధ్రువీకరణకు ఇప్పటి వరకు సరైన రికార్డులు లేవు. లబ్ధిదారుల కుటుంబ సభ్యుల వివరాల కోసం వారు చెప్పిందే నమ్మాల్సి వస్తోంది. ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలతో అధికారిక సర్టిఫికెట్ పొందే అవకాశం లేదు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు అధికారికంగా ఫ్యామిలీ రిజిస్టర్ తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఫ్యామిలీ రిజిస్టర్ కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్, హర్యానా, కర్ణాటక, ఉత్తరాఖండ్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాలు వివిధ పేర్లతో రాష్ట్ర స్థాయి కుటుంబాల డేటా బేస్ నిర్వహిస్తున్నాయి. కుటుంబ రిజిస్టర్ నిర్వహణ, ప్రజలకు సర్టిఫికెట్ ఇచ్చే బాధ్యతను సర్కార్ రెవెన్యూ శాఖకు అప్పగించింది. ఫ్యామిలీ రిజిస్టర్, సర్టిఫికెట్ల విధి విధానాలపై రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో కొత్తగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇది ఉన్నవారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీ-సేవ ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం రేషన్‌కార్డుల్లోని డేటాను ప్రామాణికంగా తీసుకోనున్నారు. పౌర సరఫరాల శాఖ డేటాను రెవెన్యూ శాఖ తీసుకోనుంది. కుటుంబ రిజిస్టర్ డిజిటల్ రూపంలో ఉంటుంది. ప్రతీ ఫ్యామిలీకి గుర్తింపు కార్డు ఇస్తారు. రేషన్ కార్డు నంబరునే ఫ్యామిలీ రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నంబర్ గా ఇవ్వాలని నిర్ణయించారు. రిజిస్టర్‌లో ప్రతి కుటుంబానికి రిజిస్టర్ ఐడెంటిఫికేషన్ నెంబరు, కుటుంబ యజమాని, కుటుంబ సభ్యులందరి పేర్లు, వయసు, కుటుంబ పెద్దతో బంధుత్వం, ఆధార్ నంబరు, అడ్రస్ ఉంటాయి. ప్రజలకు అవసరమైనప్పుడు మీ-సేవ ద్వారా కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ ఇస్తారు.

మీరు చిరంజీవిలా బంగీ జంపింగ్ చేయాలనుకుంటున్నారా.. మన దేశంలో బెస్ట్ ప్లేసెస్ ఇవే..



రోటీన్ లైఫ్ బోర్ కొడుతోంది.. డిఫరెంట్ గా జీవితంలో కొంత సమయం అయినా గడపాలని కోరుకుంటున్నారా... ఉత్తేజకరమైన సంఘటనలను అనుభవించాలనుకుంటే.. భారతదేశంలో మీకు అనువైన ప్రదేశాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా దైర్యసాహస కార్యక్రమాలను ఇష్టపడేవారు బంగీ జంపింగ్ చేయాలనీ భావిస్తారు. అటువంటి వారు మన దేశంలో ఈ ప్రదేశాలను తప్పక సందర్శించాలి. ఇవి మీ ప్రయాణ ఆనందాన్ని రెట్టింపు చేస్తాయి. అందరికీ కొత్త ప్రదేశాలకు వెళ్ళడానికి.. ప్రయాణం చేయడం అంటే ఇష్టమే. మీకు నచ్చిన ప్రదేశాలకు వెళ్ళడం వలన మీలోని ఒత్తిడిని, అలసటను తగ్గిస్తుంది. ప్రతి సంవత్సరం ప్రజలు వేసవి సెలవుల్లో కొత్త ప్రదేశాలకు ప్రయాణించాలని ప్లాన్ చేసుకుంటారు. కనుక మీరు కూడా ఈ సెలవులను చిరస్మరణీయంగా మార్చుకోవాలన ుకుంటే.. భారతదేశంలో సాహసాలు చేసేందుకు అనువైన కొన్ని ప్రదేశాలను సందర్శించవచ్చు. అక్కడ మీ మనసును రిఫ్రెష్ చేయడమే కాకుండా..వాటిని గుర్తుచేసుకున్నప్పుడు మీ ముఖంలో చిరునవ్వు తెచ్చే అందమైన అనుభవాన్ని కూడా పొందుతారు. అందరికీ కొత్త ప్రదేశాలకు వెళ్ళడానికి.. ప్రయాణం చేయడం అంటే ఇష్టమే. మీకు నచ్చిన ప్రదేశాలకు వెళ్ళడం వలన మీలోని ఒత్తిడిని, అలసటను తగ్గిస్తుంది. ప్రతి సంవత్సరం ప్రజలు వేసవి సెలవుల్లో కొత్త ప్రదేశాలకు ప్రయాణించాలని ప్లాన్ చేసుకుంటారు. కనుక మీరు కూడా ఈ సెలవులను చిరస్మరణీయంగా మార్చుకోవాలనుకుంటే.. భారతదేశంలో సాహసాలు చేసేందుకు అనువైన కొన్ని ప్రదేశాలను సందర్శించవచ్చు. అక్కడ మీ మనసును రిఫ్రెష్ చేయడమే కాకుండా..వాటిని గుర్తుచేసుకున్నప్పుడు మీ ముఖంలో చిరునవ్వు తెచ్చే అందమైన అనుభవాన్ని కూడా పొందుతారు.భారతదేశంలో అనేక రకాల సాహస కార్యకలాపాలు నిర్వహించడానికి అనువైన ప్రదేశాలున్నాయి. పారాగ్లైడింగ్, రాఫ్టింగ్, బంగీ జంపింగ్, స్కూబా డైవింగ్ వంటి సరదా కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈరోజు మనం భారతదేశంలో బంగీ జంపింగ్ కోసం ఏ ప్రదేశాలను అన్వేషించవచ్చో తెలుసుకుందాం. భారతదేశంలోని ఈ 5 ప్రదేశాలు బంగీ జంపింగ్ కు ఉత్తమమైనవి. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ రిషికేశ్‌లో ఉంది. భారతదేశంలో అనేక రకాల సాహస కార్యకలాపాలు నిర్వహించడానికి అనువైన ప్రదేశాలున్నాయి. పారాగ్లైడింగ్, రాఫ్టింగ్, బంగీ జంపింగ్, స్కూబా డైవింగ్ వంటి సరదా కార్యకలాపాలు నిర్వహించబడతాయి. ఈరోజు మనం భారతదేశంలో బంగీ జంపింగ్ కోసం ఏ ప్రదేశాలను అన్వేషించవచ్చో తెలుసుకుందాం. భారతదేశంలోని ఈ 5 ప్రదేశాలు బంగీ జంపింగ్ కు ఉత్తమమైనవి. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ రిషికేశ్‌లో ఉంది.రిషికేశ్ ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందడమే కాదు మీరు ఇక్కడ అనేక రకాల సాహస కార్యకలాపాలను కూడా చేయవచ్చు. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే మీరు ఇక్కడ బంగీ జంపింగ్‌ను కూడా ఆస్వాదించవచ్చు. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ ఇక్కడ జరుగుతుంది. దీని ఎత్తు 83 మీటర్లు. రిషికేశ్‌లో, శివపురి , మోహన్ చట్టి వంటి ప్రదేశాలలో బంగీ జంపింగ్ చేస్తారు. రిషికేశ్ ప్రశాంతమైన వాతావరణానికి ప్రసిద్ధి చెందడమే కాదు మీరు ఇక్కడ అనేక రకాల సాహస కార్యకలాపాలను కూడా చేయవచ్చు. అత్యంత ప్రత్యేకమైన విషయం ఏమిటంటే మీరు ఇక్కడ బంగీ జంపింగ్‌ను కూడా ఆస్వాదించవచ్చు. భారతదేశంలోనే ఎత్తైన బంగీ జంపింగ్ ఇక్కడ జరుగుతుంది. దీని ఎత్తు 83 మీటర్లు. రిషికేశ్‌లో, శివపురి , మోహన్ చట్టి వంటి ప్రదేశాలలో బంగీ జంపింగ్ చేస్తారు.లోనావాలా.. ముంబైలో నివసిస్తున్నా లేదా అక్కడికి వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే లోనావాలా పేరు ఖచ్చితంగా మీ పర్యటన జాబితాలో ఉండాలి. ఈ ప్రదేశం ఎంత అందంగా ఉంటుందో అంతే వినోద కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఈ ప్రదేశాన్ని సందర్శించడం ద్వారా మీరు ప్రశాంతతను అనుభవిస్తారు. మీరు ఇక్కడ బంగీ జంపింగ్ కూడా చేయవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ ఎత్తు 28 మీటర్లు. ఇక్కడ మీరు ఈ క్రీడను సురక్షితంగా ఆడేలా చేస్తారు. అందమైన దృశ్యాలను ఆస్వాదిస్తూ మీరు ఇక్కడ బంగీ జంపింగ్ చేయవచ్చు. లోనావాలా.. ముంబైలో నివసిస్తున్నా లేదా అక్కడికి వెళ్లాలని ప్లాన్ చేస్తుంటే లోనావాలా పేరు ఖచ్చితంగా మీ పర్యటన జాబితాలో ఉండాలి. ఈ ప్రదేశం ఎంత అందంగా ఉంటుందో అంతే వినోద కార్యక్రమాలు కూడా జరుగుతాయి. ఈ ప్రదేశాన్ని సందర్శించడం ద్వారా మీరు ప్రశాంతతను అనుభవిస్తారు. మీరు ఇక్కడ బంగీ జంపింగ్ కూడా చేయవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ ఎత్తు 28 మీటర్లు. ఇక్కడ మీరు ఈ క్రీడను సురక్షితంగా ఆడేలా చేస్తారు. అందమైన దృశ్యాలను ఆస్వాదిస్తూ మీరు ఇక్కడ బంగీ జంపింగ్ చేయవచ్చు.గోవాలో బంగీ జంపింగ్: గోవా బీచ్‌లు, పార్టీలకు ప్రసిద్ధి చెందింది. అయితే ఈ ప్రదేశంలో మీరు బంగీ జంపింగ్ కూడా ఆనందించవచ్చని మీకు తెలుసా. ఇక్కడ గ్రావిటీ జోన్‌లో, అంజునా బీచ్‌లో 35 మీటర్ల ఎత్తులో బంగీ జంపింగ్ జరుగుతుంది. దేశ విదేశాల నుంచి ప్రజలు బంగీ జంపింగ్ చేయడానికి ఇక్కడికి వస్తారు. ఈ బీచ్ బంగీ జంపింగ్ కు ప్రసిద్ధి చెందింది. గోవాలో బంగీ జంపింగ్: గోవా బీచ్‌లు, పార్టీలకు ప్రసిద్ధి చెందింది. అయితే ఈ ప్రదేశంలో మీరు బంగీ జంపింగ్ కూడా ఆనందించవచ్చని మీకు తెలుసా. ఇక్కడ గ్రావిటీ జోన్‌లో, అంజునా బీచ్‌లో 35 మీటర్ల ఎత్తులో బంగీ జంపింగ్ జరుగుతుంది. దేశ విదేశాల నుంచి ప్రజలు బంగీ జంపింగ్ చేయడానికి ఇక్కడికి వస్తారు. ఈ బీచ్ బంగీ జంపింగ్ కు ప్రసిద్ధి చెందింది.బెంగళూరులో సరదా బంగీ జంపింగ్: బెంగళూరు ఐటీ హబ్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఆఫీసు సంస్కృతికి అతీతంగా, ఈ ప్రదేశం సాహస కార్యక్రమాలతో నిండి ఉంది. బంగీ జంపింగ్ కోసం పర్యాటకులు ఎల్లప్పుడూ ఇక్కడికి వస్తారు. ఇక్కడ బంగీ జంపింగ్ 25 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. ఇక్కడ బంగీ జంపింగ్ చేసే సరదా వేరు. బెంగళూరులో సరదా బంగీ జంపింగ్: బెంగళూరు ఐటీ హబ్‌గా ప్రసిద్ధి చెందింది. అయితే ఆఫీసు సంస్కృతికి అతీతంగా, ఈ ప్రదేశం సాహస కార్యక్రమాలతో నిండి ఉంది. బంగీ జంపింగ్ కోసం పర్యాటకులు ఎల్లప్పుడూ ఇక్కడికి వస్తారు. ఇక్కడ బంగీ జంపింగ్ 25 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. ఇక్కడ బంగీ జంపింగ్ చేసే సరదా వేరు.గురుగ్రామ్: గురుగ్రామ్‌లో కూడా బంగీ జంపింగ్ చేయవచ్చని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. గురుగ్రామ్‌లోని బ్యాక్‌యార్డ్ స్పోర్ట్స్ క్లబ్‌లో మీరు బంగీ జంపింగ్‌ను ఆస్వాదించవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ 60 మీటర్ల ఎత్తులో జరుగుతుంది. గురుగ్రామ్: గురుగ్రామ్‌లో కూడా బంగీ జంపింగ్ చేయవచ్చని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. గురుగ్రామ్‌లోని బ్యాక్‌యార్డ్ స్పోర్ట్స్ క్లబ్‌లో మీరు బంగీ జంపింగ్‌ను ఆస్వాదించవచ్చు. ఇక్కడ బంగీ జంపింగ్ 60 మీటర్ల ఎత్తులో జరుగుతుంది.

ఈ టీ మీ ఆరోగ్యానికి సహజ సంజీవని.. ఉదయాన్నే తాగితే ఆ వ్యర్థాలన్నీ బయటకు

'సుగంధ ద్రవ్యాల రాణి'గా పిలవబడే ఏలకులు కేవలం వంటకాలకు రుచిని జోడించడమే కాకుండా, ఆరోగ్యానికి అమృతంలా పనిచేస్తాయి. పురాతన కాలం నుండి సాంప్రదాయ వైద్యంలో ఉపయోగించబడుతున్న ఈ సుగంధ ద్రవ్యం, టీ రూపంలో తీసుకుంటే శరీరాన్ని శుద్ధి చేసి, నోటి ఆరోగ్యం నుండి గుండె, కాలేయం వరకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఏలకుల టీ తయారీ విధానం, దాని అద్భుతమైన ఆరోగ్య లాభాలను తెలుసుకుని, మీ రోజువారీ జీవనంలో ఈ సహజ సంజీవనిని చేర్చుకోండి యాలకులను 'సుగంధ ద్రవ్యాల రాణి'గా పిలుస్తారు. ఇది భారతదేశం, శ్రీలంక మధ్య అమెరికాలో ఎక్కువగా సాగు చేస్తుంటారు. పురాతన కాలం నుండి వంట సాంప్రదాయ వైద్యంలో దీనిని ఉపయోగిస్తున్నారు. ఇది దాల్చిన చెక్క, జాజికాయ, లవంగాలు అల్లం వంటి వేడిని కలిగించే లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తీపి రుచికరమైన వంటకాలకు రుచిని జోడిస్తుంది. అంతేకాదు ఈ కింది ప్రయోజనాలను కూడా చేకూరుస్తుంది.

నోటి ఆరోగ్యానికి వరం

ఏలకుల టీ నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది నోటి దుర్వాసనను తొలగించి, శ్వాసను తాజాగా, సుగంధంగా ఉంచుతుంది. యాంటీ బాక్టీరియల్ గుణాలు నోటిలో బ్యాక్టీరియా వృద్ధిని అడ్డుకుంటాయి, దంతాలు, చిగుళ్ల సమస్యలను తగ్గిస్తాయి.

జీర్ణక్రియ సమస్యలకు పరిష్కారం

ఈ టీ జీర్ణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. అజీర్ణం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలను తగ్గించి, ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. భోజనం తర్వాత ఒక కప్పు టీ తాగితే కడుపు తేలికగా అనిపిస్తుంది.

శరీర శుద్ధి, రోగనిరోధక శక్తి



ఏలకుల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌ను నియంత్రించి, కణాల నష్టాన్ని తగ్గిస్తాయి. ఈ టీ శరీరంలో పేరుకుపోయిన టాక్సిన్స్‌ను తొలగించి, కాలేయం, మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. యాంటీవైరల్, యాంటీ బాక్టీరియల్ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచి, జలుబు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి.

బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యం

ఏలకుల టీ జీవక్రియను వేగవంతం చేసి, శరీరంలోని అదనపు కొవ్వును కరిగిస్తుంది, బరువు నియంత్రణకు సహాయపడుతుంది. అధిక పొటాషియం కంటెంట్ రక్తపోటును తగ్గించి, రక్తనాళాల ఒత్తిడిని నియంత్రిస్తుంది. రోజూ ఒక కప్పు టీ తాగడం హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

మానసిక ప్రశాంతతకు సహాయం

ఏలకుల టీ మనసును ప్రశాంతంగా ఉంచుతుంది. ఒత్తిడి, ఆందోళనతో బాధపడేవారికి ఇది సహజ ఉపశమనం అందిస్తుంది. హార్మోన్ల సమతుల్యతను కాపాడి, మానసిక సంతోషాన్ని పెంచుతుంది.

జాగ్రత్తలుజి

ఏలకులు వేడి స్వభావం కలిగి ఉంటాయి కాబట్టి, అతిగా తీసుకోవడం వల్ల అసౌకర్యం కలగవచ్చు.

గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు వైద్య సలహా తీసుకోవాలి.

అలెర్జీలు ఉన్నవారు తక్కువ మోతాదుతో ప్రారంభించి, శరీర స్పందనను పరిశీలించాలి.

పెళ్లిళ్ల స్పెషల్ నోరూరించే గుమ్మడి వడియాలు.. రుచిగా పెట్టే సులభమైన విధానం!



ఎండాకాలం వచ్చిందంటే చాలు, ప్రతి తెలుగు ఇంటి వాకిలిలోనూ కనిపించే ఒక ప్రత్యేకమైన దృశ్యం గుమ్మడి వడియాలు. బంగారు వర్ణంలో మెరిసే ఈ చిన్న చిన్న ముక్కలు కేవలం రుచికరమైనవే కాదు, మన సంస్కృతిలో ఒక భాగం కూడా. మరి ఈ గుమ్మడి వడియాలను ఈజీగా పక్కా కొలతలతో ఎలా పెట్టుకోవాలి... తయారీ విధానం వంటివి చదివేయండి.. గుమ్మడి వడియాలంటే ఇష్టపడని వారుండరు. ఎండాకాలంలో చేసుకునే నిల్వ ఆహారాల్లో వీటని కచ్చితంగా చేర్చుతుంటారు. ఈ వడియాలను కూరల్లో, పులుసుల్లో వేసుకుంటే ప్రత్యేకమైన రుచి వస్తుంది. మరి, గుమ్మడి వడియాలు టేస్టీగా ఎలా పెట్టాలో తెలుసుకుందాం రండి.

కావలసిన పదార్థాలు:

గుమ్మడికాయ 1 (సుమారు 1 కిలో) బియ్యప్పిండి 1 కప్పు (లేదా మీ గుమ్మడి తురుము యొక్క పరిమాణానికి తగినంత) పచ్చిమిర్చి 2-3 (మీ రుచికి తగినట్లు) అల్లం చిన్న ముక్క (ఒక ఇంచు) జీలకర్ర 1 టీస్పూన్ ఉప్పు రుచికి తగినంత నూనె వడియాలు పెట్టడానికి (ఆప్షనల్)ముందుగా గుమ్మడికాయను శుభ్రంగా కడిగి, దాని తొక్క తీసేయాలి. లోపలి గింజలు, మెత్తటి గుజ్జును పూర్తిగా తొలగించాలి. గుమ్మడికాయను తురుము పీటతో పలుకుగా తురుముకోవాలి. మరీ మెత్తగా కాకుండా కొంచెం బరకగా ఉంటే వడియాలు రుచిగా ఉంటాయి. తురిమిన గుమ్మడి తురుమును ఒక పలుచని కాటన్ గుడ్డలో వేసి గట్టిగా పిండి నీరంతా తీసివేయాలి. ఇది చాలా ముఖ్యమైన దశ. నీరు ఉంటే వడియాలు సరిగ్గా ఎండవు మరియు పాడైపోయే అవకాశం ఉంది.ఒక పెద్ద గిన్నెలో పిండిన గుమ్మడి తురుము వేయాలి. అందులో బియ్యప్పిండి, సన్నగా తరిగిన పచ్చిమిర్చి, తురిమిన అల్లం, జీలకర్ర రుచికి తగినంత ఉప్పు వేయాలి. ఈ పదార్థాలన్నింటినీ బాగా కలపాలి. పిండి గుమ్మడి తురుముతో కలిసి ముద్దలాగా రావాలి. అవసరమైతే కొద్దిగా బియ్యప్పిండిని కలుపుకోవచ్చు, కానీ మరీ ఎక్కువ పిండి వేయడం వల్ల గుమ్మడి రుచి తగ్గిపోతుంది.

వడియాలకు ప్రిపరేషన్:

ఒక ప్లాస్టిక్ షీట్ లేదా శుభ్రమైన కాటన్ గుడ్డను ఎండలో వేయాలి. మీ చేతులకు కొద్దిగా నూనె రాసుకొని (లేదా నూనె లేకుండానే), తయారుచేసిన మిశ్రమం నుండి చిన్న చిన్న ఉండలుగా తీసుకుని వడియాల ఆకారంలో ఒత్తుకోవాలి. మీకు నచ్చిన ఆకారంలో (చిన్నవి లేదా పెద్దవి) పెట్టుకోవచ్చు. కొందరు గుండ్రంగా పెడతారు, మరికొందరు కొంచెం పొడవుగా పెడతారు. పెట్టిన వడియాలను నేరుగా ఎండలో 2-3 రోజుల పాటు బాగా ఎండబెట్టాలి. ప్రతిరోజూ ఒకసారి వాటిని తిప్పుతూ ఉండాలి, అప్పుడే అన్ని వైపులా సమానంగా ఎండిపోతాయి. వడియాలు గట్టిగా, పూర్తిగా పొడిబారే వరకు ఎండబెట్టాలి. వడియాలు పూర్తిగా ఎండిపోయిన తర్వాత వాటిని ఒక గాలి చొరబడని డబ్బాలో లేదా కవర్లో నిల్వ చేసుకోవాలి. ఇలా నిల్వ చేసుకుంటే చాలా కాలం పాటు తాజాగా ఉంటాయి.

రుచి కోసం మరికొన్ని చిట్కాలు:

మీరు కావాలంటే కొద్దిగా ఇంగువ కూడా కలపవచ్చు. ఇది వడియాలకు మంచి సువాసనను ఇస్తుంది.

కొంతమంది కొత్తిమీర లేదా కరివేపాకు కూడా సన్నగా తరిగి కలుపుతారు.

పచ్చిమిర్చికి బదులుగా కొద్దిగా కారం కూడా వేసుకోవచ్చు.

ఇలా చేస్తే మీ గుమ్మడి వడియాలు చాలా రుచిగా వస్తాయి. వీటిని వేయించుకొని నేరుగా తినవచ్చు లేదా కూరల్లో, పులుసుల్లో వేసుకొని ఆస్వాదించవచ్చు.

ఈ సమయంలో గోళ్లు కత్తిరిస్తున్నారా..? అయితే ఇది మీకోసమే..!



మన ఇంట్లో పెద్దవాళ్లు తరచూ చెప్పే మాట.. రాత్రిపూట గోళ్లు కత్తిరించవద్దని.. ఇది ఒక సాధారణ సూచనలా అనిపించినా.. దీని వెనుక ఉన్న కారణాలు శాస్త్రం, ఆరోగ్యం, సంప్రదాయ విశ్వాసాలతో చాలా అనుబంధం కలిగి ఉంటాయి. ఈ అలవాటు ఎందుకు వచ్చిందో అర్థం చేసుకోవాలి. పురాతన నమ్మకాల ప్రకారం రాత్రిపూట కొన్ని చెడు శక్తులు ఎక్కువగా తిరుగుతాయట. ఆ సమయంలో గోళ్లు కత్తిరిస్తే ఆ శక్తులు మనకు కష్టాలు కలిగిస్తాయని అనుకునేవారు. కొందరు రాత్రిపూట చంద్రుడి శక్తి చాలా ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు. గోళ్లు తీసేస్తే ఆ శక్తి తగ్గిపోతుందని కూడా భావించేవారు. శాస్త్రంలో కూడా రాత్రిపూట గోళ్లు కత్తిరించడం వల్ల శరీరం సమతుల్యత దెబ్బతింటుందని చెబుతారు. విద్యుత్ అందుబాటులో లేని రోజులలో రాత్రిపూట వెలుతురు చాలా తక్కువగా ఉండేది. అప్పుడు దీపాల వెలుతురులో గోళ్లు కత్తిరించడం ప్రమాదకరం. ఒక్కసారి తప్పుగా కత్తిరిస్తే వేళ్లకు గాయం అయ్యే అవకాశం ఉండేది. అందుకే రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదని చెప్పారు. ఇది పూర్తిగా భద్రతతో సంబంధం ఉన్న విషయం. సాయంత్రం అయ్యాక మన శరీరం నిద్రపోవడానికి తయారవుతుంది. రోజంతా పని చేసి అలిసిపోయిన శరీరం అప్పుడు రెస్ట్ తీసుకోవాలనుకుంటుంది. అలాంటి టైమ్‌లో పదునైన వస్తువులు పట్టుకోవడం, జాగ్రత్తగా చేయాల్సిన పనులు చేయడం మంచిది కాదు. గోళ్లు కత్తిరించడం అంటే చాలా శ్రద్ధగా చేయాల్సిన పని. అలసటగా ఉన్నప్పుడు సరిగ్గా చేయకపోతే ప్రమాదం జరిగే ఛాన్స్ ఉంది. గోళ్లు కత్తిరించినప్పుడు చిన్న చిన్న ముక్కలు కింద పడతాయి. వాటికి బ్యాక్టీరియా లేదా దుమ్ము అంటుకుని ఉండొచ్చు. పగటిపూట లైట్‌లో అవి బాగా కనిపిస్తాయి కాబట్టి వాటిని తీసి పారేయొచ్చు. కానీ రాత్రిపూట మంచం మీద కూర్చొని గోళ్లు కత్తిరిస్తే అవి అక్కడే పడిపోతాయి. పొరపాటున అవి మనం తినే ఆహారంలో కలిసిపోయే ఛాన్స్ ఉంది. అలా జరిగితే ఆరోగ్యం పాడవుతుంది. అంతేకాదు ఆ గోళ్ల ముక్కలకు చీమలు, చిన్న పురుగులు కూడా వస్తాయి. రాత్రిపూట గోళ్లు కత్తిరించకూడదనే సలహా కేవలం మూఢనమ్మకం కాదు. దీనివెనుక భద్రత, పరిశుభ్రత, ఆరోగ్యం, శారీరక స్థితి అన్నీ మిళితమై ఉన్నాయి. పగటిపూట వెలుతురులో గోళ్లు కత్తిరించడం వల్ల గాయాల ప్రమాదం తగ్గుతుంది. అదనంగా పరిశుభ్రంగా ఉండే అవకాశం కూడా ఎక్కువ. నేలపై కాగితం లేదా బట్టను పరచి ఆపై కత్తిరిస్తే గోళ్లు ఒక్కచోటే చేరుతాయి. మన పెద్దల సూచనను నిర్లక్ష్యం చేయకుండా వెలుతురు ఉన్న సమయంలో గోళ్లు కత్తిరించటం మంచి అలవాటు.

జుట్టు రాలడం ఆగాలంటే ఈ నీళ్లు తాగాల్సిందే..! ఇది మంచి టానిక్ లా పని చేస్తుంది..!



ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా మెరిసే జుట్టు కావాలని ఉంటుంది. ఈ రోజుల్లో జుట్టు రాలడం, పెరగకపోవడం, బలహీనత వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో సహజమైన మునగ ఆకుల నీరు బాగా ఉపయోగపడుతుంది. దీన్ని తాగడం వల్ల జుట్టు బలంగా మారుతుంది. మునగ ఆకులు విటమిన్ %ూా, జ, జు, దీ% లను అందిస్తాయి. ఇందులో ఐరన్, జింక్, అమైనో ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి అన్ని కలిసి జుట్టు మూలాలను బలంగా మార్చడంలో సహాయపడతాయి. ఆకులలో ఉండే పోషకాలు జుట్టు ఎదుగుదలకు అవసరమైన సహజ మార్గం అందిస్తాయి. మునగ గింజలు కూడా శక్తివంతంగా పనిచేస్తాయి. మునగ ఆకుల నీటిని తాగడం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. జీర్ణక్రియ మెరుగవుతుంది. తల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. జుట్టు బలంగా, మెత్తగా, ప్రకాశవంతంగా మారుతుంది. తలలో కొత్త జుట్టు మొదలవుతుంది. ఇది సాధారణంగా రసాయనాలు వాడకుండా చక్కగా పెరిగే సహజ మార్గం. గుప్పెడు తాజా మునగ ఆకులను తీసుకొని శుభ్రంగా కడగాలి. వీటిలో ఉండే మురికి తొలగించాలి. తరువాత రెండు కప్పుల నీటిని మరిగించాలి. నీరు మరిగిన తర్వాత అందులో ఆకులను వేసి 10 నిమిషాలు ఇంకా మరిగించాలి. తరువాత వడకట్టి నీరు చల్లార్చి తాగాలి. దీనిని ఖాళీ కడుపుతో తీసుకుంటే బాగా పని చేస్తుంది. మునగకాయలను చిన్న ముక్కలుగా రెండు కట్ చేసుకోవాలి. ఇప్పుడు రెండు కప్పుల నీటిని మరిగించి అందులో ఈ ముక్కలు వేసి 10 నిమిషాలు మరిగించాలి. తరువాత వడకట్టి చల్లబర్చాలి తాగాలి. ఉదయం ఖాళీ కడుపుతో తాగాలి. ఒక కప్పుతో మొదలుపెట్టి, క్రమంగా రెండు కప్పుల వరకు తీసుకోవచ్చు. రుచి సరిగా అనిపించకపోతే తేనె లేదా నిమ్మరసం కొద్దిగా వేసుకోవచ్చు. దీన్ని వారంలో మూడుసార్లు తాగినా సరిపోతుంది. క్రమంగా రెండు నెలలు తాగితే మంచి ఫలితాలు కనిపిస్తాయి. మునగ నీటిని తాగడమే కాకుండా.. తల కడుక్కోవడానికి కూడా వాడొచ్చు. తలపై ఈ నీటిని పోస్తే తల చర్మం చల్లగా ఉంటుంది. దీంతో తలలో రక్త ప్రసరణ మెరుగవుతుంది. జుట్టు బలంగా మారుతుంది. మునగ నీటిలో విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరంలో ఉన్న విషాలను బయటకు పంపుతుంది. చర్మానికి మెరుపు తీసుకువస్తుంది. జుట్టు ఎదుగుదల క్రమంగా మెరుగవుతుంది.

ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు చెక్ పెట్టొచ్చు..!



అరటి పండు తిన్నాక మిగిలే తొక్కను చాలా మంది వ్యర్థంగా వదిలేస్తారు. కానీ అది జుట్టు సంరక్షణలో అద్భుత ఫలితాలు ఇస్తుంది. సహజంగా దొరికే ఈ తొక్కను సరైన రీతిలో వాడితే జుట్టు రాలే సమస్య తగ్గుతుంది. తల చర్మానికి పోషణ ఇస్తూ కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. అరటి పండు తిన్నాక మిగిలిపోయే తొక్కను చాలా మంది విసిరేస్తారు. కానీ అదే తొక్క జుట్టుకు అద్భుతంగా పనిచేస్తుంది. సరైన రీతిలో వాడితే ఇది జుట్టు రాలడాన్ని తగ్గించటమే కాకుండా కొత్త జుట్టు పెరగడంలో సహాయపడుతుంది. ఆరోగ్యంగా జుట్టు పెరగాలంటే దీన్ని ఉపయోగించడం మంచిది.

అరటి తొక్కలో చాలా పోషకాలు

పొటాషియం.. ఇది తలపై తేమను నిలుపుతుంది. తల చర్మం పొడి కాకుండా ఉండేలా చూస్తుంది.

మెగ్నీషియం.. ఇది తల చర్మంలో రక్తప్రసరణను మెరుగుపరుస్తుంది.

విటమిన్ ఇవి జుట్టు ఫోలికల్స్ కు బలం ఇస్తాయి.

ఇవి జుట్టు రాలే సమస్య తగ్గించడంలో సహాయపడతాయి.

హెయిర్ మాస్క్

పండిన అరటి తొక్క 1, కొబ్బరి నూనె 1 టీస్పూన్, తేనె 1 టీస్పూన్. ఈ మూడు పదార్థాలను బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి 30 నిమిషాలు ఉంచాలి. తర్వాత తల శుభ్రంగా కడగాలి. ఇది తలకు పోషణ అందించి జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

అరటి తొక్క వాటర్ వాష్

అరటి తొక్క 1, నీరు 2 కప్పులు. అరటి తొక్కను నీటిలో 10 నిమిషాలు మరిగించాలి. చల్లారిన తర్వాత ద్రవాన్ని వడకట్టాలి. ఈ నీటిని చల్లార్చి తల కడిగిన తర్వాత చివరిగా తలపై పోయాలి. ఇది తల చర్మాన్ని తేమగా ఉంచుతుంది. జుట్టు మెత్తగా మారుతుంది.

అరటి తొక్కతో ఆయిల్

అరటి తొక్క 1, కొబ్బరి లేదా ఆలివ్ నూనె అర కప్పు. ఒక చిన్న పాత్రలో నూనె వేడి చేయాలి. అందులో తొక్క వేసి 10 నిమిషాలు మరిగించాలి. మరిగిన తరువాత వడకట్టి ఒక సీసాలో నిల్వ చేయాలి. ఈ నూనెను తలకు అప్లై చేసి అరగంట తర్వాత తల కడిగితే జుట్టు కాంతివంతంగా మారుతుంది. మీ తల చర్మం సున్నితంగా ఉంటే.. ఈ నూనెను మొదట కొద్దిగా పరీక్షించి చూడటం మంచిది. ఈ నూనెను ఉపయోగించే ముందు చల్లబరచాలి. సాధారణంగా వారానికి ఒక్కసారి ఈ నూనెను వాడితే సరిపోతుంది. అంతకంటే ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం లేదు. కేవలం అరటి తొక్కతో ఇంట్లోనే తక్కువ ఖర్చుతో జుట్టు సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. దీనిలో రసాయనాలు లేవు, సైడ్ ఎఫెక్ట్ కూడా ఉండవు. కొద్దికాలం పాటు క్రమంగా వాడితే జుట్టులో మంచి మార్పు కనిపిస్తుంది. ఈ పదార్థాలు సహజమైనవే అయినా..

ఇథనాల్ పెట్రోల్ పై అసత్య ప్రచారం కోర్టుకెక్కిన నితిన్ గడ్కరీ



మెటా, గూగుల్ తో పాటు ఇతర సోషల్ మీడియా సంస్థలపై పరువు నష్టం దావా వేసుకోవచ్చని ముంబై హైకోర్టు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి అనుమతి ఇచ్చింది. దీంతో గడ్కరీ సోషల్ మీడియా సంస్థలపై దావా వేయనున్నారు. ఈ20 పెట్రోల్ తో తన కుటుంబం లాభపడుతుందని సోషల్ మీడియాలో పోస్టుల ద్వారా తనకు పరువు నష్టం కలిగించేలా ప్రచారం జరుగుతోందని గడ్కరీ ముంబై హైకోర్టును ఆశ్రయించారు. మెటా, గూగుల్ తోపాటు పలు సోషల్ మీడియా సంస్థలపై పరువు నష్టం దావా వేసుకునేందుకు అనుమతి ఇవ్వాలన కోరారు. దీనికి ముంబై హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరువు నష్టం కలిగించే కంటెంట్ ముంబైలో కూడా సోషల్ మీడియాలో కనిపిస్తుందని.. అందుకే ఈ కేసును ఇక్కడి హైకోర్టు కూ డా విచారించవచ్చని గడ్కరీ తరఫు న్యాయవాది వాదించారు. దీనిని అంగీకరించిన కోర్టు దావా దాఖలు చేసేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ20 పెట్రోల్ కు తానే బాధ్యుడను అయినట్లు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ20 పెట్రోల్ లో కలిపి ఇథనాల్ మిశ్రమం ద్వారా తన కుటుంబం లబ్ధి పొందుతుందని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గడ్కరీ పేరు, ఫొటో గొంతును ఏఐ సహాయంతో మార్చి డీప్ ఫేక్ కంటెంట్ క్రియేయ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆయన తరఫు న్యాయవాది వాదించారు. ఇదంతా తప్పుడు ప్రచారమని పేర్కొన్నారు. నితిన్ గడ్కరీ పరువుకు భంగం కలిగేలా పోస్టులు చేస్తున్నారని అన్నారు. నితిన్ గడ్కరీ రాజీనామా చేయాలంటూ కొత్త ఉద్యమం.. స్వచ్ఛమైన పెట్రోల్ మా హక్కు అంటూ పుట్టుకొచ్చిన ఈ20 జనతా పార్టీ చట్టబద్దమైన విమర్శలు, ఆరోపణలకు తాను వ్యతిరేకం కాదని గడ్కరీ స్పష్టం చేశారు. కానీ తప్పుడు ఆరోపణలు, డీప్‌ఫేక్ ప్రచారంపై మాత్రమే చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం ఈ20 పెట్రోల్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పెట్రోల్ లో 20 శాతం ఇథనాల్ కలుపుతారు. అంటే 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్ ఉంటుంది. విదేశీ మారక ద్రవ్యాన్ని పొదుపు చేయడానికి, ముడి చమురు దిగుమతి తగ్గించుకోవడానికి పెట్రోల్ లో ఇథనాల్ కలుపుతున్నారు. అయితే ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. మైలేజ్ తగ్గుతుందని, ఇంజన్ చెడిపోతున్నాయని చాలా మంది చెబుతున్నారు. అయితే కొత్త వాహనాలు ఇథనాల్ పెట్రోల్ ను తట్టుకోగలవని చెబుతున్నారు. పాత వాహనాల్లో మైలేజ్ తగ్గే అవకాశం ఉందని పేర్కొంటు న్నారు. వెంటనే పెట్రోల్ లో ఇథనాలు కలపడం తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రా యాలు కాదని గమనించగలరు. మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

పశ్చిమాసియా సంక్షోభం ఉన్నా దేశ ఆర్థిక వృద్ధి కొనసాగుతోంది కేంద్రం

విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేందుకు కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం

ఇప్పట్లో ఎరువుల ధరలు తగ్గే సూచనలు కనిపించడం లేదని వెల్లడి



పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ పెను సవాళ్లను ఎదుర్కొంటోందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ముడి చమురు, ఎరువుల దిగుమతుల బిల్లులు భారీగా పెరగడంతో ఆర్థికంగా సవాళ్లు ఎదురవుతున్నాయని, అయినప్పటికీ దేశ ఆర్థిక వృద్ధి ముందుకెళ్తోందని స్పష్టం చేశాయి. విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచేందుకు కేంద్రం మరిన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఎరువుల మార్కెట్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని వెల్లడించాయి. ఎరువుల లభ్యత తగ్గి ధరలు పెరుగుతున్నాయని, ఇప్పట్లో ఎరువుల ధరలు తగ్గే సూచనలు కనిపించడం లేదని వివరించాయి. ఎరువుల రాయితీ కోసం వార్షిక బడ్జెట్‌లో 1.77 లక్షల కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించిందని, ఈ కేటాయింపులను రెండింతలు పెంచాలని ఆర్థిక శాఖను వ్యవసాయ మంత్రి కోరినట్లు తెలిపాయి.ఇక అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడంతో సామాన్యులపై భారం పడకుండా చూసేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలకు కేంద్రం అండగా నిలిచిందని పేర్కొన్నాయి. పశ్చిమాసియా యుద్ధం మొదలైన తొలి 78 రోజుల్లో ఓఎంసీలకు వాటిల్లిన నష్టాలను పూడ్చేందుకు 1.23 లక్షల కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీని కేంద్రం ప్రకటించిందని గుర్తుచేశాయి. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి వినియోగదారులకు కాస్త ఉపశమనాన్ని ఇచ్చాయని తెలిపాయి. దీని కారణంగా దేశీయ ఇంధన రిటైలర్లు ప్రతిరోజూ దాదాపు రూ.650 కోట్ల మేర నష్టాలను చవిచూస్తున్నారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.టారిఫ్ ల (సంకాలు) పరంగా ఉన్న అనిశ్చితులను పరిగణనలోకి తీసుకునే 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను రూపొందించినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి. అందువల్ల ప్రభుత్వం ప్రస్తుతానికి అదనపు అప్పుడు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాయి. రానున్న వర్షాకాల సమావేశాల్లో గ్రాంట్ల కోసం ఎలాంటి అదనపు డిమాండ్లు ప్రవేశపెట్టాల్సిన అవసరం కూడా లేదని చెప్పాయి ఆర్థిక లోటు విషయానికి వస్తే, బడ్జెట్లో నిర్దేశించుకున్న 4.3 శాతం జీడీపీ లక్ష్యం ఇప్పటికీ స్థిరంగానే ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రంగ సంస్థల వాటాల ఉపసంహరణ (డిస్‌ఇన్వెస్ట్‌మెంట్), ఆస్తుల నగదీకరణ (అసెట్ మానిటైజేషన్) లాంటి పన్నేతర ఆదాయ మార్గాలను ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని స్పష్టం చేశాయి. దీపం, డీపీఈ సంస్థల నుంచి వాటాల ఉపసంహరణ (డిస్‌ఇన్వెస్ట్‌మెంట్), ఆస్తుల నగదీకరణకు సంబంధించి అమలు చేయాల్సిన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నాయి. ఈ విభాగం కింద బడ్జెట్లో అంచనా వేసిన రూ.80వేల కోట్ల ఆదాయం కంటే ఎక్కువే వస్తుందని ఆశిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో ఐడీబీఐ బ్యాంక్ వాటాల ఉపసంహరణ ప్రక్రియ కూడా జరగనుందని అన్నారు.“ఏప్రిల్-జూన్ త్రైమాసిక గణాంకాలతోపాటు, రుతుపవనాలపై ఎల్‌నినో ప్రభావం ఎలా ఉందో స్పష్టత వచ్చిన తర్వాత, జులై నెలలో ప్రభుత్వం స్థూల ఆర్థిక గణాంకాలను మరోసారి సమీక్షించనుంది. ఇక 2026 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో ఉన్న వృద్ధి జోరు 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో కొనసాగుతోంది. విదేశాల నుంచి వచ్చే నిధులు (రెమిటెన్సెస్)పై ఇప్పటి వరకు ఎలాంటి ప్రతికూల ప్రభావం పడలేదు. పైగా తాజా ఆర్థిక సంకేతాలు కూడా సానుకూలంగా ఉన్నాయి. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ప్రైవేట్ పెట్టుబడులు కూడా పుంజుకున్నాయి. ఆర్థిక సంస్కరణల జోరు ఇలానే కొనసాగే అవకాశం ఉంది. దేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ప్రవాహాన్ని మరింత పెంచడానికి మరిన్ని చర్యలు తీసుకోనున్నారు. అలాగే దేశం నుంచి పెట్టుబడులు బయటికి వెళ్లడం(క్యాపిటల్ అవుట్‌ఫ్లో)పై ఎలాంటి ఆంక్షలు ప్రతిపాదించే ప్రతిపాదన లేదు” అని సదరు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

త్వరలోనే అమెరికా భారత్ ఒప్పందం

ట్రేడ్ డీల్‌పై కీలక చర్చలు

భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంపై ముందడుగు

వచ్చే వారం భారత్‌కు రానున్న యూఎస్ ట్రేడ్ ప్రతినిధి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో భేటీ



భారత్ అమెరికా మధ్య ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం దిశగా కీలక ముందడుగు పడింది. అమెరికా ట్రేడ్ రెప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ ఈ నెల 22న భారత్‌కు రానున్నారు. జూన్ 23-24 తేదీల్లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌తో కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. ఇక్కడే మధ్యంతర వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కీలక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ విషయాన్ని భారత వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ తెలిపారు. అమెరికా ప్రతినిధుల బృందం ఇప్పటికే పలుమార్లు భారత అధికారులతో చర్చలు జరిపిందని, ఇప్పుడు డీల్‌కు తుది మెరుగులు దిద్దనున్నట్లు వెల్లడించారు.అంతకుముందు జూన్ 2-4 మధ్య యూఎస్ చీఫ్ నెగోషియేటర్ బ్రెండన్ లించ్ నేతృత్వంలోని ఒక బృందం భారత్‌తో చర్చలు నిర్వహించింది. ఆ చర్చలకు కొనసాగింపుగానే ఇప్పుడు యూఎస్‌టీఆర్ జేమిసన్ గ్రీర్ భారత్‌కు వస్తున్నారు. ఈ సమావేశాల్లో మధ్యంతర వాణిజ్య ఒప్పందంతో పాటుగా భారత్ అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపైనా చర్చలు జరగనున్నాయి. ఈ ఫిబ్రవరిలోనే రెండు దేశాలు ట్రేడ్ డీల్‌కు ప్రాథమిక విధివిధానాల్ని ఖరారు చేశాయి. తర్వాత అమెరికాలో టారిఫ్ విధానాల్లో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం అమెరికా అన్ని దేశాలపైనా 10 శాతం సాధారణ సుంకం విధిస్తోంది. ఈ పరిస్థితుల్లోనే భారత్‌కు ఇతర పోటీ దేశాలైన పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ కంటే మెరుగైన వాణిజ్య ప్రయోజనాలు ఉండేలా ఒప్పందాన్ని సవరించే అవకాశం ఉంది.సెక్షన్ 301 విచారణలపైనా చర్చ భారత్‌తో పాటుగా మరికొన్ని దేశాలపై అమెరికా సెక్షన్ 301 కింద ప్రత్యేక విచారణలు నిర్వహిస్తోంది. బలవంతపు కార్మిక వ్యవస్థ అంశంపై భారత్ సహా 54 దేశాలపై 12.5 శాతం అదనపు సుంకం విధించాలని అమెరికా ప్రతిపాదించింది. ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉందని, భారత్ తన అభిప్రాయాన్ని ఇప్పటికే అమెరికాకు తెలియజేసిందని రాజేష్ అగర్వాల్ చెప్పారు.ఇక ప్రతిపాదిత ఒప్పందం ప్రకారం భారత్ రానున్న ఐదేళ్లలో అమెరికా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, విమానాలు, విమాన విడిభాగాలు సహా విలువైన లోహాలు, సాంకేతిక ఉత్పత్తులు, కోకింగ్ కోల్ కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇదే సమయంలో అమెరికా పారిశ్రామిక ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ కూడా సుంకాల్ని తగ్గించే అంశం కూడా చర్చల్లో ఉంది. ఇదే సమయంలో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని కూడా కామర్స్ సెక్రటరీ అగర్వాల్ స్వాగతించారు. ఈ డీల్ దీర్ఘకాలం అమల్లో ఉండి, పశ్చిమాసియా ప్రాంతంలో శాంతిని తీసుకురావాలని భారత్ ఆశిస్తుందని ఆకాంక్షించారు.బంగారం దిగుమతులు జంప్ మరోవైపు 2026 మే నెలకు సంబంధించిన వాణిజ్య గణాంకాల్ని ప్రభుత్వం విడుదల చేసింది. మే నెలలో భారత ఎగుమతులు 18 శాతం పెరిగి 45.2 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 20.62 శాతం పెరిగి 73.41 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో వాణిజ్య లోటు 28.21 బిలియన్ డాలర్లుగా ఉంది. ఎగుమతి, దిగుమతుల వ్యత్యాసాన్నే వాణిజ్య లోటుగా చెబుతారు. 2026-27 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- మే కాలంలో మొత్తం ఎగుమతులు 88.91 బిలియన్ డాలర్లుగా ఉండగా వృద్ధి 16.09 శాతంగా నమోదైంది. ఇక మే నెలలో పశ్చిమాసియాకు ఎగుమతుల విలువ స్వల్పంగా తగ్గి 5.30 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతకుముందు ఏడాది ఇదే సమయంలో ఇది 5.38 బిలియన్ డాలర్లుగా ఉండేది. బంగారం దిగుమతులు ఏప్రిల్- మే సమయంలో ఏకంగా 60 శాతం పెరిగి విలువ 9.04 బిలియన్ డాలర్లకు చేరుకుంది.


'బ్యాంకింగ్ రంగంలో ఏఐ బేస్డ్ ఫ్రాడ్స్‌పై ఆందోళన

84 శాతం మందికి నష్టాలు

భారతీయ బ్యాంకింగ్ రంగంలో పెరిగిన ఏఐ ఆధారిత మోసాలు

1,440 మంది బ్యాంకింగ్ రంగ నాయకులపై సర్వే

సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్ సంస్థ బయోక్యాచ్ నివేదికలో సర్వే ఫలితాలు



ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్థిక సంస్థలు ఏఐ ఆధారిత మోసాల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడైంది. ఈ క్రమంలో భారతీయ బ్యాంకులు ఈ మోసాలకు సంబంధించిన సవాళ్లను తీవ్రంగా ఎదుర్కొంటున్నాయని స్పష్టమైంది. గత ఏడాది కాలంలో 84 శాతం మంది బ్యాంకింగ్ రంగ నాయకులు (బ్యాంకింగ్ లీడర్స్) ఫ్రాడ్స్ వల్ల అధిక నష్టాలను చవిచూసినట్లు తేలింది. ఈ మేరకు ప్రముఖ సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్ సంస్థ బయోక్యాచ్ తన నివేదికలో సర్వే ఫలితాలను వెల్లడించింది.25 దేశాలకు చెందిన ఫ్రాడ్ మేనేజ్‌మెంట్, యాంటీ మనీలాండరింగ్, రిస్క్ అండ్ కంప్లయన్స్ విభాగాలలో పనిచేస్తున్న 1,440 మంది బ్యాంకింగ్ రంగ నాయకుల అభిప్రాయాలను ఈ సర్వే కోసం సేకరించారు. ఈ సర్వేలో ఆర్థిక మోసాలు, ఏఐ ఆధారిత ముప్పుల విషయంలో భారత్ అత్యంత ఆందోళన చెందుతున్న, తీవ్ర ప్రభావానికి గురవుతున్న దేశాలలో ఒకటిగా నిలిచింది. రాబోయే ఏడాదిలో ఏఐ ఏజెంట్లను బ్యాంకింగ్ రంగాన్ని దుర్వినియోగం చేయగల అతిపెద్ద బలహీనతగా ప్రతిస్పందనదారులు గుర్తించారు.భారతదేశంలో సర్వే చేసిన 100 మంది బ్యాంకింగ్, ఆర్థిక నేరాల నివారణ విభాగ నాయకులలో 90 శాతం మంది తమ సంస్థలలో గత ఏడాది కాలంలో మోసాల ప్రయత్నాలు పెరిగాయని చెప్పారు. ఇది ప్రపంచ మోసాల సగటులో 81 శాతం కంటే గణనీయంగా ఎక్కువ. గత సర్వేలో నమోదైన 70 శాతంతో పోలిస్తే ఈ సంఖ్యలో భారీ పెరుగుదల కనిపించింది. ప్రపంచ సగటు 76 శాతంతో పోలిస్తే, 84 శాతం మంది భారతీయ బ్యాంకింగ్ నాయకులు మోసాల వల్ల నష్టాలు పెరుగుతున్నట్లు చెప్పారు. గతేడాది సర్వేలో కేవలం 57 శాతం మంది మాత్రమే ఫ్రాడ్‌ల వల్ల నష్టపోయారు. ఈసారి ఆ సంఖ్యలో గణనీయమైన పెరుగుదల నమోదైంది.ఆర్థిక మోసాలలో కృత్రిమ మేధస్సు పాత్రపై పెరుగుతున్న ఆందోళనలను ఈ నివేదిక ఎత్తిచూపింది. 93 శాతం మంది భారతీయ ప్రతిస్పందనదారులు ఏఐ వల్ల మోసాలు, స్కామ్ పద్ధతులు మరింత అధునాతనంగా మారాయని భావిస్తున్నారు. అలాగే 90 శాతం మంది భవిష్యత్తులో చట్టబద్ధమైన ఏఐ సహాయక చర్యలకు హానికరమైన, తారుమారు చేసిన కార్యకలాపాలకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం చాలా సవాలుతో కూడుకున్న పని అని పేర్కొన్నారు. మోసపూరిత కార్యకలాపాల వేగం విషయంలో కూడా భారతీయ బ్యాంకింగ్ నాయకులు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆందోళన చెందుతున్న వారిలో ఉన్నారు. ప్రపంచ సగటు 76 శాతంతో పోలిస్తే 95 శాతం మంది ప్రతిస్పందనదారులు మోసాల వేగం పెరుగుతుండటం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.సర్వేలో పాల్గొన్న భారతీయులలో సుమారు 48 శాతం మంది తమ సంస్థలు ఏటా మోసాల కారణంగా 10 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ నష్టపోతున్నాయని తెలిపారు. వీరిలో 32 శాతం మంది 25 మిలియన్ డాలర్లు, 16 శాతం మంది 50 మిలియన్ డాలర్లు, 6 శాతం మంది ప్రతి ఏటా 100 మిలియన్ డాలర్లకు పైగా నష్టాలను తమ సంస్థలు చవిచూస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ మోసాల వల్ల వినియోగదారులు కూడా తీవ్రంగా నష్టపోతున్నట్లు వెల్లడించారు. సర్వేలో పాల్గొన్న 58 శాతం మంది తమ వినియోగదారులు ఏటా మోసాల కారణంగా 5 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ నష్టపోతున్నారని అంచనా వేశారు. 44 శాతం మంది 10 మిలియన్ డాలర్లకు పైగా నష్టాలను భరిస్తున్నాయని తెలిపారు. భారత్‌లో తక్షణ చెల్లింపు ప్లాట్‌ఫారమ్‌లు కూడా మోసాలకు ఒక ప్రధాన కారణమని కూడా బయోక్యాచ్ నివేదిక అంచనా వేసింది. యూపీఐ వేగంగా విస్తరించడం మోసగాళ్లకు కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొంది. అయితే ఈ నివేదికపై బయోక్యాచ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గాడి మజోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వినియోగదారులు ఈ-కామర్స్ సైట్లు, ఆర్థిక సంస్థలతో వ్యవహరించే విధానాన్ని ఏఐ పునర్నిర్మిస్తోందని అభిప్రాయపడ్డారు. అలాగే నేరగాళ్లు మోసాలను అమలు చేసే విధానాన్ని కూడా ఇది మారుస్తుందని చెప్పారు. ఈ మోసాలను అరికట్టేందుకు చాలా జాగ్రత్తలు వహించాలని సూచించారు.

రూ.5వేలు ఉంటే చాలు పోస్టాఫీస్ ఫ్రాంచైజీ బిజినెస్

ఎవరైనా అప్లై చేసుకోవచ్చు

తపాలాశాఖ ఫ్రాంచైజీ 2.0తో విస్తృత ఉపాధి అవకాశాలు

విద్యార్థులు, నిరుద్యోగులు, చిరుద్యోగులందరికీ లబ్ధి

ఇంటి దగ్గరి నుంచి వ్యాపారం చేసుకోవచ్చు



భారతీయ తపాలా శాఖ దేశ పౌరుల కోసం పలు రకాల పథకాలను నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఎటువంటి రిస్కూ లేకుండా ఆయా స్కీమ్స్ ద్వారా గ్యారెంటీ రిటర్న్స్ పొందవచ్చు. అందుకే పోస్టాఫీసు పథకాల్లో పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుంది. అయితే, కేవలం పొదుపు పథకాలు మాత్రమే కాకుండా, సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకునే సరికొత్త అవకాశాలను సైతం కల్పిస్తోంది. అదే ప్రోస్టాఫీసు “ఫ్రాంచైజీ స్కీమ్ 2.0”. చాలా తక్కువ పెట్టుబడితో ఈ ఫ్రాంచైజీ ద్వారా ఇంటి వద్ద నుంచే ఆదాయాన్ని పొందవచ్చు. మరి, ఈ స్కీమ్? వివరాలు ఏంటి? ఎవరు అర్హులు? డబ్బులు ఎలా సంపాదించాలి? అనే మరిన్ని వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.నేటి డిజిటల్? యుగంలో తన సేవల్ని మరింత వేగవంతం చేసే దిశగా తపాలాశాఖ అడుగులేస్తోంది. ఈ-కామర్స్ రంగంలో పెరుగుతున్న పోటీని తట్టుకుని ప్రజలకు మరింత దగ్గరయ్యేందుకు “ఫ్రాంచైజీ స్కీమ్? 2.0”ను అందుబాటులోకి తెచ్చింది. నిజానికి ఈ స్కీమ్? ఎప్పటినుంచో ఉన్నా.. సరికొత్తగా అప్?డేట చేసి 2.0ని జనవరి 1, 2026 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చింది. కొరియర్, ఎక్స్‌ప్రెస్, పార్సిల్ విభాగంలో సేవల్ని బలోపేతం చేయడం కోసం ఈ పథకానికి రూపకల్పన చేసింది. అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ(ఏపీటీ)ని ఉపయోగించి ఆధునిక, పారదర్శక, పౌర కేంద్రిత సేవలను అందించడమే దీని ప్రధానం లక్ష్యం.ఏఏ సేవలు అందించవచ్చు: స్పీడ్ పోస్ట్ డాక్యుమెంట్ బుకింగ్, స్పీడ్ పోస్ట్ పార్సిల్ బుకింగ్, ఇండియా పోస్ట్ పార్సిల్ సేవలు, ఇంటర్నేషనల్ ఈఎమ్ఎస్, ఐటీపీఎస్ సేవలు, క్లిక్ అండ్ బుక్, పిక్-అప్ సేవలు, క్యాష్ ఆన్ డెలివరీ, ఇంటివద్ద నుంచే పార్సిల్ సేకరణ ఇలా రకరకాల సేవలను ఈ స్కీమ్? ద్వారా ప్రజలకు అందించవచ్చు.ఫ్రాంచైజీ రకాలు: గతంలో లాగా కేవలం ఒకే కౌంటర్ సర్వీస్ కాకుండా, కొత్త నిబంధనల ప్రకారం ఫ్రాంచైజీదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 4 రకాల సేవలను ఎంచుకోవచ్చు బుకింగ్ మాత్రమే: స్పీడ్ పోస్ట్, పార్సిల్స్ వంటివి బుక్ చేయడం.డెలివరీ మాత్రమే: మీ పరిధిలోని పార్సిళ్లను కస్టమర్ల ఇళ్లకు డెలివరీ చేయడం.పికప్ మాత్రమే ఈ-కామర్స్ వ్యాపారుల దగ్గరకు వెళ్లి పార్సిళ్లను సేకరించడం.అన్ని సేవలు కలిపి: బుకింగ్, పికప్, డెలివరీ అన్నీ కలిపి ఒకే అవుట్‌లెట్ ద్వారా నిర్వహించడం.ఫ్రాంచైజీ కోసం కావాల్సిన సదుపాయాలు: ఎంచుకునే సేవలను బట్టి సదుపాయాలు మారతాయని అధికారులు చెబుతున్నారు. డెలివరీ సేవల కోసం వెహికల ఉంటే సరిపోతుందంటున్నారు. అదే బుకింగ్ సేవలకు చిన్న స్థలం, స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్, ఇంటర్నెట్, ప్రింటర్ వంటి మౌలిక సదుపాయాలు అవసరమని వివరిస్తున్నారు.18 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులు, నిరుద్యోగులు, చిరుద్యోగులు, మహిళలు, వర్తకులు.. ఎవరైనా ఈ స్కీమ్?లో పెట్టుబడి పెట్టి ఆదాయాన్ని పొందవచ్చు.బుకింగ్ సేవలు నిర్వహించాలనుకునేవారు గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అదే కేవలం డెలివరీ సేవలకు అయితే 10వ తరగతి ఉత్తీర్ణత సరిపోతుంది.ఈ స్కీమ్ కోసం దరఖాస్తు చేసే అభ్యర్థులకు స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ వినియోగంపై కనీస అవగాహన ఉండాలి.డెలివరీ సేవలకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. అలాగే సొంత వాహనం కలిగి ఉండాలి.పాన్ కార్డ్ తప్పనిసరి. పోస్టల్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఈ పథకానికి అనర్హులు.కమీషన్, లావాదేవీలు ఇలా: ఫ్రాంచైజీ కార్యకలాపాల ప్రకారం భద్రతా డిపాజిట్ నిర్ణయించారు. డెలివరీ, పికప్ సేవలకు రూ.5వేలు, బుకింగ్ సేవలకు రూ.10వేలు, అన్ని సేవలకు రూ.15వేలు తప్పనిసరిగా చెల్లించాలి. నిబంధనల ప్రకారం ఈ మొత్తం తిరిగి చెల్లిస్తారు. ప్రతి బుకింగ్, పికప్, డెలివరీపై కమీషన్ లభిస్తుంది. వ్యాపారం పెరిగేకొద్దీ కమీషన్ శాతం పెరుగుతుంది.

హైదరాబాదీలకు షాక్ ఇక నీరు దొరకడం కష్టమే



హైదరాబాద్ మహానగర వాసులకు తీవ్ర ఇబ్బందులు తప్పేలా లేవు. వచ్చే వేసవి కాలం నాటికి హైదరాబాద్ లో తీవ్ర నీటి కొరత ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే భూగర్భ జలాలు పడిపోయాయని.. వర్షాలు లేకుంటే తీవ్రమైన నీటి సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. రోజుకు 500 నుంచి 600 బోర్లు ఎండిపోతున్నాయని చెబుతున్నారు. సిటీలో ఇప్పటికే 5 వేల నుంచి 6 వేల బోర్లు పూర్తిగా ఎండిపోయినట్లు చెబుతున్నారు. అటు ప్రాజెక్టుల్లో కూడా నీరు లేకపోవడంతో హైదరాబాద్ కు నీటి తరలించడం కష్టంగా మారుతుంది. కృష్ణా బేసిన లోని ప్రాజెక్టుల్లో నీరు డెడ్ స్టోరేజీకి చేరింది. ఇటు గోదావరిలోని ప్రవాహం లేదు. మంజీరాలో కూడా నీరు అంతంత మాత్రంగా ఉంది. ఈ నేపథ్యంలో భాగ్యనగరం వాసులు నీటి కోసం కష్టాలు పడాల్సి వస్తుందంటూ నిపుణులు చెబుతున్నారు. ఎన్ లినో ప్రభావంతో వర్షాలు కురవడం కష్టమని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో హైదరాబాద్ లో నీటి సమస్య తీవ్రమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సిటీలో రోజు 18 వేల నీటి ట్యాంకర్లు వాడుతున్నారు. అయితే సిటీలోని చెరువుల్లో కూడా నీరు అడుగంటుతుంది. దీంతో ట్యాంకర్ల ద్వారా కూడా నీటి సరఫరా కష్టంగా మారింది. క్యూర్ పరిధిలోని మొత్తం 14.50 లక్షల నీటి కనెక్షన్ లు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. రోజువారీగా 550 మిలియన్ గ్యాలరీ పర్ డే నీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదే అదునుగా భావిస్తున్న ప్రైవేట్ ట్యాంకర్ యజమానులు దోచుకుంటున్నారు. జంట జలాశయాల పరీవాహక ప్రాంతాలలోని శిఖం భూముల్లో అక్రమంగా బోర్లు తవ్వి, విచక్షణారహితంగా నీటిని లాగుతున్నారు. నగరానికి నీటి సరఫరా కోసం వారు వ్యవసాయ బోర్లను కూడా లీజుకు తీసుకొంటున్నారు. మదాపూర్ సున్న చెరువు వద్ద ఇష్టమొచ్చినట్లు బోర్లు వేసి నీటి తప్పువుతున్నారు. ఒక్కో ట్యాంకరుకు రూ.600 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారు. భవిష్యత్ లో ఇది రూ.2000 చేరిన ఆశ్చర



నాకు ఎవరేం పని చేసినా నచ్చదంటున్న వెంకీ



టాలీవుడ్ యాక్టర్ వెంకటేశ్, స్టార్ డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వస్తున్నచిత్రం 'ఆదర్శ కుటుంబం' వెంకీ 77వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను గాంధీ జయంతి సందర్భంగా, అక్టోబర్ 2వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారని తెలిసిందే. ప్రతి కుటుంబం గుర్తుపెట్టుకోవాల్సిన తేదీ.. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం తలుపులు తెరుచుకోబోతున్నాయి..అంటూ మేకర్స్ హైప్ పెంచేస్తున్నారు. తాజాగా ప్రమోషన్స్‌లో భాగంగా వెంకీ పోషిస్తున్న చిట్టిబాబు పాత్ర గ్లింప్స్‌ను షేర్ చేశారు. కిచెన్‌లో ఏసీనా.. నాన్న నువ్వు వంట చేసేటప్పుడు హ్యాపీగా ఏసీ వేసుకుని చేసుకోవచ్చు. అవును నేను మ్యాన్ ఆఫ్ ది హౌస్. వాషింగ్ మెషిన్ కూడా ఉంది.. నీకు పని బాగా తగ్గిపోయినట్టేనని శ్రీనిధి శెట్టి అంటున్న డైలాగ్స్‌తో షురూ అయింది గ్లింప్స్. చిట్టిగారు అని రఘుబాబు అంటుంటే అస్తమానం తలతిప్పకండి బుజ్జిగారు మెడ పట్టేస్తుంది.. నాకు ఎవరేం పని చేసినా నచ్చదు. అందుకే అన్నీ నేనే చూసుకుంటానంటున్నాడు వెంకీ.. ఆదర్శ కుటుంబం అంటూ నారా రోహిత్ డైలాగ్స్‌తో ఎండ్ అయింది గ్లింప్స్. మొత్తానికి చిట్టిబాబుగా వెంకీ అండ్ ఫ్యామిలీ పక్కా వినోదాన్నిఅందించబోతుందని తాజా గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు), వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీకి స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. వెంకటేష్, త్రివిక్రమ్ కాంబోలో వస్తున్న మొదటి ఫుల్ లెంగ్త్ సినిమా కావడంతో అంచనాలు భారీగానే నెలకొన్నాయి.

పొలిమేర 3 లో యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా..

మైండ్ బ్లోయింగ్ అప్‌డేట్‌తో పెరిగిన అంచనాలు!



టాలీవుడ్‌లో హారర్, మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'పొలిమేర' ఫ్రాంచైజీ ఇప్పుడు మూడో భాగంతో ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగం ఓటీటీలో సంచలన విజయాన్ని నమోదు చేయగా, రెండో భాగం థియేటర్లలో భారీ వసూళ్లు సాధించి ఈ ఫ్రాంచైజీని మరో స్థాయికి తీసుకెళ్లింది. ఇప్పుడు 'పొలిమేర 3' పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్న వేళ, చిత్రబృందం ప్రకటించిన తాజా అప్‌డేట్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. మూడో భాగంలో సీనియర్ నటుడు, 'యాక్షన్ కింగ్' అర్జున్ సర్జా కీలక పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అర్జున్ ఎంట్రీతో 'పొలిమేర 3' కథ మరింత విస్తృతంగా, భారీ స్థాయిలో ఉండబోతుందనే సంకేతాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. హారర్, మిస్టరీతో పాటు యాక్షన్ అంశాలు కూడా ఈసారి మరింత బలంగా ఉండనున్నాయనే చర్చ సాగుతోంది. దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించిన 'మా ఊరి పొలిమేర' ఎలాంటి అంచనాలు లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రామీణ నేపథ్యంలో మంత్రతంత్రాలు, చేతబడులు, మూఢనమ్మకాల చుట్టూ తిరిగే కథ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ఈ సినిమాతో హాస్యనటుడు సత్యం రాజేష్ పూర్తి స్థాయి హీరోగా, నటుడిగా ప్రశంసలు అందుకున్నారు. ఆయన నటన, కథలోని ట్విస్టులు, థ్రిల్లింగ్ అంశాలు సినిమాను ప్రత్యేకంగా నిలబెట్టాయి. మొదటి భాగం విజయంతో ఉత్సాహంగా రెండో భాగాన్ని థియేటర్ల కోసం భారీ స్థాయిలో రూపొందించారు. 'పొలిమేర 2' విడుదల తర్వాత ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన లభించింది. మిస్టరీ, హారర్, భావోద్వేగాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధించి నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.ఇప్పుడు మూడో భాగం గత రెండు చిత్రాల కంటే మరింత భారీ స్థాయిలో రూపొందుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల విడుదలైన 'బ్లస్ట్' చిత్రంతో అర్జున్ సర్జా మరోసారి తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌తో మంచి విజయాన్ని అందుకుంది. యాక్షన్ సన్నివేశాల్లో అర్జున్ చూపించిన ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను మెప్పించాయి.ఇలాంటి సమయంలో ఆయన 'పొలిమేర 3'లో భాగం కావడం సినిమాకు మరింత బలం చేకూర్చే అంశంగా భావిస్తున్నారు.


'మహేంద్రగిరి వారాహి' రిలీజ్ డేట్ ఫిక్స్..

ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా పవన్ కళ్యాణ్..!



సుమంత్ హీరోగా, దర్శకుడు సంతోష్ జాగర్లపూడి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక సోషియో ఫాంటసీ చిత్రం 'మహేంద్రగిరి వారాహి' విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే కాన్సెప్ట్ పోస్టర్లు, ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సెప్టెంబర్ 11న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు. ఈ సందర్భంగా హీరో సుమంత్ మాట్లాడుతూ, ఈ సినిమా కోసం దాదాపు రెండున్నరేళ్ల పాటు కృషి చేసినట్లు తెలిపారు. మధ్యలో కొన్ని కారణాల వల్ల ప్రాజెక్ట్ ఆలస్యమైనప్పటికీ, చివరకు అనుకున్న స్థాయిలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నామని చెప్పారు. కథలో ఎన్నో ఊహించని ట్విస్టులు ఉంటాయని, దర్శకుడు సంతోష్ జాగర్లపూడి ప్రేక్షకులకు పూర్తిగా కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందించారని అన్నారు.ఈ సినిమాలో కీలక పాత్ర కోసం నటి ఐశ్వర్యా రాజేశ్‌ను సంప్రదించగా, కథ నచ్చి వెంటనే అంగీకరించారని సుమంత్ వెల్లడించారు. అయితే ఆమె వారాహి అమ్మవారి పాత్రలో కనిపిస్తారా? లేక మరో ప్రత్యేకమైన పాత్రలో ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తారా? అనే విషయాన్ని మాత్రం ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. ఆ సర్‌ప్రైజ్‌ను ప్రేక్షకులు థియేటర్లలోనే ఆస్వాదించాలని కోరారు. సినిమా బడ్జెట్ గురించి మాట్లాడుతూ, మొదట రూ.10 కోట్లలో సినిమా పూర్తి చేయాలని భావించామని, కానీ కథకు తగ్గట్టుగా విజువల్ ఎఫెక్ట్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో ఖర్చు గణనీయంగా పెరిగిందన్నారు. ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ వర్క్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, ప్రేక్షకులకు గూస్‌బంప్స్ వచ్చేలా విజువల్స్ రూపొందించామని వెల్లడించారు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ, ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయనను సంప్రదించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అధికారికంగా ఖరారైన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. చిత్రంలో ఓ ప్రముఖ స్టార్ హీరో దాదాపు 20 నిమిషాల పాటు ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారని నిర్మాత మధు వెల్లడించారు. అయితే ఆ స్టార్ హీరో ఎవరు అనే విషయాన్ని మాత్రం గోప్యంగా ఉంచడంతో సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి.

రిషబ్ శెట్టి 'ఛత్రపతి శివాజీ మహారాజ్'లో భూమి పెడ్నేకర్.. యోధురాలి పాత్రలో బాలీవుడ్ బ్యూటీ!



పాన్ ఇండియా స్టార్ రిషబ్ శెట్టి ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న ప్రతిష్టాత్మక చారిత్రక చిత్రం ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పై మరో ఆసక్తికరమైన అప్డేట్ బయటకు వచ్చింది. భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిన మరాఠా సామ్రాజ్య స్థాపకుడు, మహా వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితకథ ఆధారంగా ఈ భారీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొనగా, తాజాగా హీరోయిన్ ఎంపికకు సంబంధించిన కీలక సమాచారం వెలుగులోకి వచ్చింది.ఈ సినిమాలో బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్ కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఆమె చరిత్రలో తన ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన బేలవాడి మల్లమ్మ పాత్రను పోషించనుంది. శౌర్యం, త్యాగం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఈ పాత్ర సినిమాలో అత్యంత ప్రాధాన్యత కలిగి ఉంటుందని సమాచారం. భూమి పెడ్నేకర్ ఇప్పటివరకు ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు తొలిసారి ఇలాంటి చారిత్రక యోధురాలి పాత్రలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. కాగా, 'కాంతార' సినిమాతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రిషబ్ శెట్టి, ఇప్పుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం ఆయన ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ వ్యక్తిత్వం, యుద్ధ నైపుణ్యం, నాయకత్వ లక్షణాలను తెరపై అత్యంత సహజంగా ఆవిష్కరించేందుకు మేకర్స్ భారీ స్థాయిలో సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు సందీప్ సింగ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. కథ, విజువల్ డిజైన్, యుద్ధ సన్నివేశాలు, సెట్ల రూపకల్పన వంటి అంశాలపై చిత్రబృందం చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటులు అర్జున్ రాంపాల్, వివేక్ ఒబెరాయ్ కూడా కీలక పాత్రలు పోషించనున్నారు. వీరి పాత్రలకు సంబంధించిన పూర్తి వివరాలను మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. అయితే చారిత్రక నేపథ్యానికి తగ్గట్టుగా ప్రతి పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుందని తెలుస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి కథను ప్రముఖ రచయిత రిషి విర్మాని అందిస్తుండగా, సంగీత బాధ్యతలను జాతీయ అవార్డు గ్రహీత అమిత్ త్రివేది నిర్వహిస్తున్నారు. చారిత్రక చిత్రానికి తగ్గట్టుగా శక్తివంతమైన నేపథ్య సంగీతం, భావోద్వేగభరితమైన పాటలను రూపొందించనున్నట్లు సమాచారం. ఈ ఏడాది చివర్లో సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రం 2028లో ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com